వైఎస్ఆర్ కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

మంగళవారం 23 జూన్ 2026

# రైతన్న మీ కోసం కార్యక్రమం



**కలికిరి, జూన్ 22, ప్రభాతవార్త:** మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో సోమవారం వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు మర్రికుంటపల్లె పంచాయతీలో వీఆర్ఓ సురేష్‌కుమార్‌రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ బిందులు రైతన్న మీ కోసం కార్యక్రమం చేపట్టారు. పంచాయతీలోని కడియవాండ్లపల్లి, వంకగడ్డపల్లి గ్రామాల్లో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రైతన్న మీ కోసం కార్యక్రమం ద్వారా పథకాల గురించి రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ అసిస్టెంట్ బిందు మాట్లాడుతూ ప్రతి రైతు తాము పండించిన పంటకు ఈ క్రాప్ చేసుకోవాలన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే ముందు రసీదులు పొందాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, రైతులు పాల్గొన్నారు.

# హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు

## ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

**మదనపల్లెక్రైం, జూన్ 22 ప్రభాతవార్త.** తన తమ్ముడిని ప్రణాళికాబద్ధంగా హత్య చేసి, దానిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారంటూ మృతుడి సోదరుడు పెద్ద బుడ్డ నాయక్ జిల్లా ఎస్పీ ధీరజ్ ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం కోటవారిపల్లె పంచాయతీ నారమాకులతాండాకు చెందిన చిన్న బుడ్డ నాయక్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఈ మృతిపై మృతుడి సోదరుడు అనుమానం వ్యక్తం చేశారు. చిన్న బుడ్డ నాయక్ భార్య రమీల (ఆశా కార్యకర్త), అదే ఊరికి చెందిన రెడ్డెప్పనాయక్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుందని, ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవని పేర్కొన్నారు. ఈ నెల 18న రాత్రి జరిగిన గొడవ అనంతరం, చిన్న బుడ్డ నాయక్ ద్విచక్ర వాహనంపై మదనపల్లెకు వెళ్తుండగా పథకం ప్రకారం వారిద్దరూ కలిసి హత్య చేయించారని ఆరోపించారు. పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారంటూ సోమవారం తాండాకు చెందిన సుమారు వంద మందికి పైగా గ్రామస్థులు, మహిళలతో కలిసి ఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న తాలూకా సీఐ కళావెంకటరమణపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ ధీరజ్.. ఘటనపై క్షేత్రస్థాయి విచారణ జరిపి వాస్తవాలను రాబట్టాలని తాలూకా పోలీసులను ఆదేశించడంతో ఆందోళనకారులు శాంతించారు.

## రెండేళ్లలో రవాణా రంగంలో

# విప్లవాత్మక మార్పులు

## స్త్రీ శక్తి నుంచి ఈబస్సుల వరకు..ఏపీఎస్ఆర్టీసీకి నూతన దిశ

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి, జూన్ 22 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత రెండేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖ, ఏపీఎస్ఆర్టీసీలో ఎన్నో సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు, సాంకేతిక అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రజా రవాణాలో సంక్షేమం, సాంకేతికత, పారదర్శకతకు పెద్దపీట వేశారని ఆయన తెలిపారు. ఆయన సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీ సేవలకు గాను జాతీయ స్థాయిలో గుర్తింపు, వరుస అవార్డులతో రాష్ట్రానికి గౌరవం లభిస్తుందని మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటివరకు 73.62 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. అలాగే దివ్యాంగ శక్తి పథకం ద్వారా 38.22 లక్షల మంది దివ్యాంగులు ఉచిత ప్రయాణ సదుపాయం పొందారని చెప్పారు. ఈ రెండు పథకాల అమలుతో ఏపీఎస్ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేషియో 69 శాతం నుంచి 92 శాతానికి పెరిగిందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా 91 బస్ స్టేషన్లలో 98 వాటర్ ప్లాంట్లు, 152 బస్ స్టేషన్లలో టాయిలెట్ ఆధునీకరణ, 621 ఫ్యాన్లు, 1,191 కుర్చీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహాకుంభమేళా, సరస్వతి పుష్కరాలు, అరుణాచలం, కార్తీక మాసం, శబరిమల ప్రత్యేక సేవల ద్వారా రూ.35 కోట్లకు పైగా అదనపు ఆదాయం సమకూరిందన్నారు. ఆర్టీసీ సేవల్లో సమయపాలన గణనీయంగా మెరుగై బయలుదేరే సమయపాలన 90 నుంచి 96 కు, గమ్యస్థానానికి చేరే సమయపాలన 79 నుంచి 88 కు పెరిగిందని తెలిపారు. ప్రమాదాల రేటు కూడా తగ్గుముఖం పట్టిందన్నారు. వాణిజ్య విభాగంలో నాన్‌ఫేర్ బాక్స్ ఆదాయం రూ.404.22 కోట్లకు, లాజిస్టిక్స్ ఆదాయం రూ.227 కోట్లకు పెరిగిందని వెల్లడించారు. అలాగే జూన్ 2024 నుంచి మార్చి 2026 వరకు రూ.1,240 కోట్ల రుణాలు, వడ్డీలు చెల్లించి ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించామని పేర్కొన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో 1,489 కొత్త బస్సులు ప్రవేశపెట్టగా, పీఎం ఈ.బస్సు సేవ పథకం కింద 750 ఈబస్సులు, తిరుపతికి అదనంగా 300 ఈబస్సులు మంజూరయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో 8,321 ఈబస్సులను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని గ్రీన్ మొబిలిటీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఐటీ రంగంలో సమగ్ర ఏపీఎస్ఆర్టీసీ మొబైల్ యాప్, మన మిత్ర వాట్సాప్ సేవలు, గూగుల్ మ్యాప్స్ అనుసంధానం, గీశ ఆధారిత డిజిటల్ చెల్లింపులు, రియల్‌టైమ్ మానిటరింగ్ వంటి ఆధునిక సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. రవాణా శాఖలో ఏపీఎస్ఆర్టీసీ సేవలను పూర్తిస్థాయిలో అమలు చేసి 85 సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువచ్చామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్స్ ఏర్పాటు చేసి వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే 12 ప్రాంతాల్లో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షలను ఆధునీకరించామని చెప్పారు. ఆటో, టాక్సీ, మాక్సీ క్యాబ్ డ్రైవర్లకు అమలు చేస్తున్న ఆటో డ్రైవర్ సేవా పథకం ద్వారా 202526లో 2.9 లక్షల మందికి రూ.436 కోట్ల ఆర్థిక సహాయం అందించామని వెల్లడించారు. కొత్త ఎలక్ట్రిక్ వాహనాలకు 5 సంవత్సరాల పన్ను మినహాయింపు, గ్రీన్ టాక్స్ తగ్గింపు వంటి నిర్ణయాలు వాహనదారులకు పెద్ద ఊరటనిచ్చాయని అన్నారు. రవాణా శాఖ ఆదాయం 202526లో రూ.5,050.35 కోట్లకు చేరగా, వాహన విక్రయాలు 9.81 లక్షలకు పెరిగి గణనీయమైన వృద్ధి నమోదు చేశాయని తెలిపారు. త్వరలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అన్ని వాణిజ్య వాహనాల ట్రాకింగ్‌ను 24 గంటల పాటు పర్యవేక్షించే విధానం అమలులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని మంత్రి తెలిపారు. నైట్ అవుట్ అలవెన్స్, జీవితకాల వైద్య సేవలు, 1,780 కారుణ్య నియామకాలు, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, పదోన్నతులు, గ్రాట్యుటీ చెల్లింపులు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ రవాణా శాఖలు సాధించిన డిజిటల్ సంస్కరణలు, ఇంధన సామర్థ్యం, లాజిస్టిక్స్ సేవలు, ఉద్యోగుల సంక్షేమం, డిజిటల్ చెల్లింపులు, వాహన ట్రాకింగ్ వ్యవస్థలకుగాను జాతీయ స్థాయిలో ఎక్సలెన్స్ అవార్డులు, స్కోచ్ అవార్డులు, అవార్డులు, నేషనల్ మొబిలిటీ అవార్డ్స్ సహా పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు మరింత నాణ్యమైన, సురక్షితమైన, పర్యావరణ హితమైన, సాంకేతికంగా ఆధునిక రవాణా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రాబోయే రోజుల్లో ఏపీఎస్ఆర్టీసీ రవాణా శాఖలను దేశంలోనే ఆదర్శవంతమైన సంస్థలుగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## పిజిఆర్ఎస్ అర్జీలపై ప్రజలకు

# భరోసా కల్పించాలి

## జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్



**మదనపల్లె, జూన్ 22 ప్రభాతవార్త :** పిజిఆర్ఎస్ అర్జీల నుంచి పరిష్కారం వరకు ప్రజలకు భరోసా కల్పించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్‌కు జిల్లాలోని వివిధ మండలాల నుంచి ప్రజలు వివిద సమస్యలపై అర్జీల రూపంలో విన్నవించారు. జిల్లాలోని మదనపల్లె, పుంగనూరు, పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటి నియోజకవర్గాలకు చెందిన ప్రజలు 374అర్జీలను సమస్యల రూపంలో విన్నవించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా అందిన ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణయిత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ ధరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్‌ఏ రీఓపనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌డిసి మాధవక్రిష్ణారెడ్డిలు పాల్గొని అర్జీదారుల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు.

## మందుల రూపంలో ప్రజల నుంచి

# నిలువుదోపిడి

### నిబంధనలు పాటించని మెడికల్ షాపు యజమానులు

### పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మెడికల్‌షాపులు

### తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

### ఎప్పుడు వస్తారో, ఎపుడు పోతారో తెలియనిపరిస్థితి

**బద్వేలు, జూన్ 22 ప్రభాతవార్త:** బద్వేలులో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మెడికల్ షాపులకు ఎలాంటి అనుమతులు లేకపోయినా ప్రజల జీవితాలతో చెలగాటమాడుతూ ఉన్నప్పటికి తనిఖీ చేయాల్సిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు తూతూ మంత్రంగా వచ్చి వెళ్లడం మామూలుగా మారింది. కొద్దిగా ఆరోగ్యం భాగాలేకపోతే ఆసుపత్రులకు వెళితే వేలాది రూపాయలు అవుతాయని ఆసుపత్రికి వెళ్లలేక మెడికల్ షాపులకు వెళ్లి మాత్రలు ఇవ్వమంటే 50 నుంచి 100 రూపాయలు తీసుకుని వెళుతున్నారేగాని ఆ మందు విలువ రూ.10లు కూడా ఉండదు. బద్వేలు పట్టణంలో 100కు పైగా మెడికల్ షాపులు ఉన్నప్పటికీ ఒక్కరూ కూడా నిబంధనలు పాటించడంలోలేదు. ప్రతి షాపులో ఫార్మాశిస్టు ఉండాలని, అతని ద్వారానే మందులు పంపిణీ చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ కేవలం ఒక సర్టిఫికెట్ తీసుకుని దాని ఆధారంగా మెడికల్ షాపులు నడుపుతున్నారు తప్ప దానిలో అనుభవజ్ఞులైన ఫార్మాశిస్టులు లేకపోవడం దురదృష్టకరం. తనిఖీకి వచ్చినపుడు అధికారులు ఫార్మాశిస్టు లేడని అడిగితే ఊరికి వెళ్లాడని, బయటకు వెళ్లాడని మాటలు చెప్పడంతో వచ్చినవారు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మందుల పేరుతో ప్రజలను నిలువు దోపిడి చేస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడడమే కాకుండా ఉన్నకాడికి దోచుకుంటున్నారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న షాపులలో ఒక మందు ఒక్కో షాపులో ఒక్కో రకంగా అమ్ముతారు. మందు ఒకటే కానీ ధర మాత్రం వివిధ రకాలు గా తీసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ జిల్లా నుంచి చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారే తప్ప నిబంధనలు పాటించని షాపులపై ఎలాంటి చర్యలు తీసుకోరు. దీనిని బట్టి చూస్తుంటే వారికి మామళ్లు వెళుతున్నాయన్నట్లుగా కనిపిస్తుంది. ఎందుకంటే నిబంధనలు పాటించని షాపులకు ఎస్ఓ (సస్పెన్స్ ఆర్డర్) ఇచ్చినపు వాటిని అమలు చేసే అధికారి లేకపోవడం, సస్పెన్స్ ఆర్డర్ వచ్చిన తర్వాత మెడికల్‌షాపులు మూసేసి షాపునుంచి ఒక్క మందుగాని, బిల్లుగాని బయటకు ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నా ఏ ఒక్కరూ పాటించడంలేదు. వీటి వలన అధికారులు ఇచ్చిన ఆర్డర్లు కూడా తుంగలో తొక్కుతన్నారంటే డ్రగ్ అధికారులపై మన షాపుయజమానులకు ఎంత అభిమానం ఉందోఅర్థమవుతుంది . పట్టణంలో ఏ మూలకు వెళ్లినా ఒక ..మిగతా 2వ పేజీలో

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

## ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



**పులివెందుల, జూన్ 22 ప్రభాతవార్త :** ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన ధ్యేయమని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. సోమవారం పులివెందుల పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకురాగా, ఆయన ఓపికగా విని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మాజీ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వేముల మండలం భూమయ్యగా రిపల్లె గట్టు వద్ద నూతనంగా నిర్మించిన నరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఎంపీ పరిశీలిం చారు. ఇటీవల పెండ్లిమర్రి మండలం కారపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన లోకేశ్వరరెడ్డి కుమారులు జయవర్ధన్ రెడ్డి (18), రాజవర్ధన్ రెడ్డి ఇద్దరూ చక్రాయ పేట అద్దాలమర్రి గ్రామం వద్ద పాపాఘ్ని నదిలో అక్రమంగా తవ్విన ఇసుక క్వారీ గుంతలో మునిగి మృతి చెందిన ఘటనపై ఎంపీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి మృతదేహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష పాల్గొన్నారు.అంతకుముందు తన నివాసం వద్దకు వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎంపీ కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేముల మండలం భూమయ్యగారిపల్లె మాజీ ఎంపీటీసీ శ్రీరామిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎంపీ పరామర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమృత్ నగర్లో దొంగ పట్టాలు సృష్టించి కబ్జా చేసే వారిపై చర్యలు తీసుకోవాలి



**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 22 ప్రభాత వార్త** కొత్తపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి అమృత నగర్ లో చర్చి కోసం కేటాయించిన స్థలాన్ని పలువురు నకిలీ పట్టాలు సృష్టించి కాజేసే యత్నం చేస్తున్నారని స్థానికులు ఆయన దృష్టికి తేవడంతో సోమవారం ఆయన ఈ విషయమై స్థానికులతో కలిసి తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కొత్తపల్లి పంచాయతీ సర్పంచిగా అమృత నగర్ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, అయితే తన పదవీకాలం పూర్తి కాగానే కొందరు ఇక్కడి భూములను దొంగ పట్టాలతో కబ్జా చేస్తున్నారు. చివరికి సచివాలయం వద్ద ప్రజల కోసం 25 అడుగుల రోడ్డు వదిలితే, పంచాయతీ ఆజ్ఞలను సైతం బేఖాతరు చేస్తూ ఆ స్థలాన్ని కూడా ఆక్రమించి పనులు సాగిస్తున్నారని కొత్తపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు నకిలీ పట్టాలు సృష్టించి నిజమైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ పట్టాలు అసలైనవా లేక నకిలీవా అనే విషయాన్ని తేల్చేందుకు తాము వీటిని ల్యాబ్‌లో టెస్ట్ చేయిస్తామని స్పష్టం చేశారు. తహసీల్దార్ వెంటనే స్పందించి ఈ దొంగ పట్టాల వ్యవహారాన్ని వెలికితీసి, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ భూదందాపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జిల్లా కలెక్టర్, ఏఎస్పీలు తక్షణమే చొరవ తీసుకొని విచారణ జరిపించాలని కోరారు. ఈ సమస్యపై త్వరలోనే ఎమ్మెల్యేను స్వయంగా కలిసి పూర్తి వివరాలు అందజేస్తామని, అధికారులు తక్షణమే స్పందించి కబ్జాలను అడ్డుకోకపోతే బాధితుల తో కలిసి పెద్ద ఎత్తున నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. ఇదే విషయమై స్థానిక బాధితులు మాట్లాడుతూ, సర్కారు స్థలాలను, రోడ్లను సైతం కబ్జా చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయని పక్షంలో, తాము అమృత నగర్ వదిలి వెళ్లిపోవడం మినహా మరో మార్గం లేదని కన్నీరు మున్నీరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రెండేళ్ళలో కూటమి ప్రభుత్వం

# అన్ని విధాల విఫలం

## మదనపల్లెకి జిల్లా కేంద్రం తప్ప అభివృద్ధి శూన్యం

## రాజంపేట ఎంపి పివి.మిథున్‌రెడ్డి

**మదనపల్లె, జూన్ 22 ప్రభాతవార్త :** రెండేళ్ళ కూటమి పాలనలో ప్రభుత్వం అన్ని విధాల విఫలం చెందిందని రాజంపేట ఎంపి పివి.మిథున్‌రెడ్డి తెలిపారు. సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించారే తప్పా అభివృద్ధి మాత్రం విస్మరించారన్నారు. మదనపల్లెకు మంజూరైన మెడికల్ కళాశాల రెండేళ్ళు అవుతున్నా పనులు ప్రారంభించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే మెడికల్ కళాశాల నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బిటికళాశాలను వైకాపా హాయంలో యూనివర్శిటిగా చేసేందుకు జీఓ ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం బిటి కళాశాలను పూర్తిగా విస్మరించి ప్రభుత్వ కార్యాలయాలకు వాడుకుంటోందన్నారు. వైకాపా స్కీమ్‌లన్నీ కూటమి ప్రభుత్వం పక్కన పెట్టడం జరిగిందన్నారు. రైతులకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. పట్టణంలో పేరుపొందిన టౌన్‌బ్యాంకులో చోటు చేసుకొన్న అవకతవకలపై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. టౌన్‌బ్యాంకులో డిపాజిట్లు వేసిన లబ్దిదారులకు భద్రత కల్పించాలన్నారు. స్కామ్‌ల మయమైన టౌన్‌బ్యాంకుపై చర్యలు తీసుకోవాలన్నారు. మదనపల్లె వాటర్‌గిడ్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను చైతన్యపరచి ప్రభుత్వాన్ని ఎండగడుతామన్నారు. డిఎస్‌సిలో జరిగిన అవకతవకలపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండను పరిరక్షించాలని మైనింగ్‌జోలికి వస్తే ఉపేక్షించము అన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాల పూర్తిగా విఫలం చెందిందని ఎద్దేవా చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్, మాజీ మున్సిపల్ ఛైర్మెన్‌లు షమీంఅస్లాం, మనూజారెడ్డి, వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, యువజన నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, పోరం కార్యదర్శి వివిఎస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఆవుల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి మిథున్‌రెడ్డి

## ఖాజీపేట ఉపాధి హామీ పథకంలో

# ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటం

### కొత్త సాంకేతికతను అక్రమాలకు వాడుకుంటున్న మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు

### ఇంట్లో కూర్చుంటే హాజరు.. ఖాతాలో పడితే 50 కమీషన్!

### అధికారుల పర్యవేక్షణ లోపంతో నిలువునా మునుగుతున్న ప్రభుత్వ ధనం



**ఖాజీపేట, జూన్ 22, ప్రభాతవార్త** ఖాజీపేట, జూన్ 22:రెక్కాడితే గానీ డొక్కాడనట్టుగా ఎండల్లో కష్టపడి పనిచేసే పేద కూలీల కోసం ఉపాధి హామీ పథకం వస్తే.. ఖాజీపేట ఉపాధి హామీ సిబ్బంది మాత్రం దానిని అవినీతికి కామధేనువుగా మార్చుకున్నారు. అవినీతిని అరికట్టడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఖిముఖ ఆధారిత హాజరు విధానాన్ని కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు తమకు అనుకూలంగా మలుచుకుంటూ కొత్త దారులకు తెరలేపారు.నిబంధనల ప్రకారం కూలీలు పని ప్రదేశానికి వచ్చి హాజరు వేయించుకోవాలి. కానీ, ఖాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆ అవసరమే లేకుండా పోయింది. కూలీలు ఎక్కడున్నా సరే.. పని మొదలయ్యే సమయానికి మేట్లు లేదా ఫీల్డ్ అసిస్టెంట్లకు వీడియో కాల్ చేస్తే చాలు, అక్కడికక్కడే ముఖ ఆధారిత హాజరు నమోదైపోతోంది. మిగతా వ్యవహారమంతా సిబ్బందే చూసుకుంటున్నారు. ఊరి పెద్దలు, చోటా నేతలు, ఫీల్డ్ అసిస్టెంట్ల బంధుమిత్రులకే ఈ ఖిప్రత్యేక సదుపాయంఖి కల్పిస్తుండటం గమనార్హం.ఇలా ఇంట్లో కూర్చుని వీడియో కాల్ ద్వారా హాజరు పొందే కూలీల బ్యాంకు ఖాతాల్లో వేతనం జమవ్వగానే, అందులోంచి 50 శాతం సొమ్మును ఫీల్డ్ అసిస్టెంట్లు నొక్కుతున్నారు. పని చేయకుండానే డబ్బులు వస్తుండటంతో కొందరు కూలీలు కూడా ఈ దోపిడీకి సహకరిస్తున్నారు. మండలంలో ప్రస్తుతం ఈ దొంగ మస్టర్ల బాగోతం యథేచ్ఛగా సాగుతోంది. ఇదిలా ఉండగా ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ కూలీల నుండి వారానికి వంద రూపాయలు తీసుకుంటున్నారు. జులై 1 నుంచి కొత్త నిబంధనలు (వీబీ జీ రామ్ జీ) అమలులోకి వస్తుండటంతో, ఈ నెలాఖరులోగా ఉపయోగించుకోని పని దినాల నిధులు రద్దవుతాయనే నెపంతో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనను పూర్తిగా గాలికొదిలేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పంపిన దొంగ లెక్కలను ఉన్నతాధికారులు కళ్లు మూసుకుని ఆమోదిస్తున్నారు. “మేము ఎండల్లో కష్టపడి చెమటోడ్చినా వచ్చేది అంతే.. వాళ్లు ఇంట్లో కూర్చుని వీడియో కాల్స్ మాట్లాడుకున్నా వచ్చేది అంతే. మా కష్టానికి, వారి దొంగ హాజరుకు తేడా లేకుండా పోయింది“ అని నిజాయితీగా పనిచేసే కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటానికి, అధికారుల నిర్లక్ష్యానికి ఖాజీపేట మండలంలో ఉపాధి హామీ లక్ష్యం పక్కదారి పడుతోంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపి, ఈ ఖిడిజిటల్ దోపిడీఖికి పాల్పడుతున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కాశీవిశ్వేశ్వరస్వామికి విశేష పూజలు



చౌడేపల్లి, జూన్ 22 ప్రభాతవార్త

చౌడేపల్లి పరిధిలోని చిన్నకొండా మర్రి అగ్రహారం వద్దగల శ్రీవిశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కార్తీకపౌర్ణమి సందర్భగా ఉదయాన్నే ఆలయంలో ప్రధానార్చకులచే అభిషేక ప్రియునికి పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణదాత మనోహర్ ఆధ్వర్యంలో భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

# నీటిపొదుపు పంటల వైవిధ్వీకరణ లక్ష్యం


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చౌడేపల్లి, జూన్ 22 ప్రభాతవార్త

నీటి పొదుపు పంటల వైవిధ్వీకరణే లక్ష్యంగా రైతులు ముందుకు వెళ్ళాలని వ్యవసాయశాఖాధికారులు శివకుమార్, మోహన్‌లన్నారు. రైతన్న మీకోసంలో భాగంగా సోమవారం చౌడేపల్లి పరిసర ప్రాంతాల్లోని పొలాలకు వెళ్ళి రైతులకు ఎపిఏఐఎంఎస్ యాప్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎల్‌నినో, బోర్లకింద వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించే అంశాలపై చర్చించారు. అంతే కాకుండా డిఎపి పంపిణీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ లీలామాధవి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కృత్తిమకాలు పరికరాల కోసం నమోదు చేసుకోండి

మదనపల్లె, జూన్ 22 ప్రభాతవార్త :

దివ్యాంగులకు ఉచిత ఆధునిక కృత్తిమ కాలు(హార్టిఫిషియల్ లిప్స్) అమరిక కోసం పేర్లు నమోదు చేసుకోవాలని వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి క్రిష్ణకిశోర్, వెలుగుస్కూల్ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అన్నమయ్యజిల్లా వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి ఆదేశాల మేరకు ఉచిత ఆదునిక కృత్రిమకాలు అవసరమైన ప్రతి దివ్యాంగులు, దివ్యాంగురాలు తన పేరును నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం బిఎం.రమేష్, డి.రమేష్ సెల్‌నెంబర్లు 807423993, 9182778324లను సంప్రదించాలని కోరారు.ఈ అవకాశాన్ని ప్రతి దివ్యాంగడు, దివ్యాంగురాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# పేకాటస్థావరంపై పోలీసుల దాడి

## ఆరుగురు అరెస్ట్.. నగదు, సెల్‌ఫోన్లు, వాహనాలు స్వాధీనం



గాలివీడు, జూన్22, ప్రభాతవార్త.

మండలపరిధి పందికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరపురం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు గాలివీడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ నరసింహారెడ్డి, సీ. ఐ కృష్ణంరాజు నాయక్ మరియు సర్కిల్ సిబ్బంది సంయుక్తంగా ఈ దాడి చేపట్టారు.దాడి సందర్భంగా జూదం ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.15,130 నగదు, 5 సెల్‌ఫోన్లు, 3 మోటార్‌సైకిళ్లు మరియు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. జూదం, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని, ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చదువుతో పాటు విద్యార్థులకు క్రీడాలు అవసరం



వేంపల్లి, జూన్ 22 ప్రభాతవార్త,

ప్రభుత్వ కళాశాల లో చదువు తున్న విద్యార్థుల కు చదువు తో పాటు క్రీడలు అవసరం అని వేంపల్లి ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవి పేర్కొన్నారు,, సోమవారం స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాల నందు అక్కడ చదువు తున్న విద్యార్థుల కు హ్యాండ్ బాల్ అట తో క్రీడాను ప్రారంభిచారు, వేంపల్లి ఉర్దూ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా ఆటల్లో ఉత్సాహం నింపడానికే క్రీడాల్లో రాణిస్తున్న మని ఆయన కోరారు,ఈ సందర్భంగా ఫీజికల్ డైరెక్టర్ నూర్ మొహమ్మద్ ఆధ్యారం లో హ్యాండ్ బాల్ గేమ్ అట ను విద్యార్థుల కు ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు,ఈ కార్యక్రమం లో అధ్యాపకులు భాస్కర్ నాయక్,మహమ్మద్ షరీఫ్, ఇర్ఫాన్, ఫైరోజ్ ఖాన్,బాషా,బాబా ఫక్రుద్దీన్, షఫీఉల్లాహ్, ఖలీలుల్లాహ్‌లు హర్షం వ్యక్తం చేశారు అలానే ఆటల పైన మక్కువ ఉన్నవారు విద్యార్థులు ప్రభుత్వజూనియర్ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాల్సిందిగా కోరుచున్నాము అడ్మిషన్స్ జరుగుతున్నాయి.

## కూటమి ప్రభుత్వంలో రైతులకు నిజమైన ఏరువాక

### టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి



తంబళ్లపల్లె జూన్ 22 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె నియోజకవర్గం లో కూటమి ప్రభుత్వం సహకారంతో రైతులకు హంద్రీనీవా సాగునీరు, జల జీవన్ మిషన్ తోస్వచ్ఛమైన ఇంటింటికి తాగునీరు, రైతులకు రైతు భరోసా తో నేడు రైతులకు నిజమైన ఏరువాక సంభవించిందని టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి ప్రశంసించారు. సోమవారం తంబళ్లపల్లె రైతు సేవా కేంద్రంలో డరైతులకు వేరుసెనగ విత్తన కాయలను ఆయన పంపిణీ చేశారు. ఏ ఈ ఓ సురేష్ మాట్లాడుతూ రైతులకు కే సిక్స్ 30 కిలోల బస్తారూ 18 36 చొప్పున విత్తన కాయలు పంపిణీ చేస్తున్నామని రైతులు సకాలంలో విత్తన కాయలు తీసుకొని నూర్పిడి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామచంద్ర, బాలకృష్ణారెడ్డి, నరసింహులు, పురుషోత్తం, వీరాంజనేయులు, రామాంజులు, నరేంద్ర నాయుడు, సామి రెడ్డి, జనసేన నాయకుడు ఎద్దుల నరసింహులు కూటమి నాయకులు రైతులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓ పై లోకాయుక్తకు

# ఫిర్యాదు చేసిన ఎంపీపీ

సిద్దవటం జూన్ 22 ప్రభాతవార్త

సిద్దవటం ఎంపీడీఓ ఫణి రాజకుమారిపై లోకాయుక్త కు ఫిర్యాదు చేసినట్లు ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల ప్రజా పరిషత్ సమావేశాలను నిర్వహించకపోవడం మరియు అడ్డుకోవడం ద్వారా స్థానిక స్వపరిపాలనకు, ప్రజా నిధులకు మరియు అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు. అధికార దుర్వినియోగం, అవినీతి ఉద్దేశాలు, సమగ్రత లోపించడం, మరియు సకాలంలో స్పందించకపోవడం వంటి అంశాలపై ఫిర్యాదు చేసినట్లు ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ ఫణి రాజకుమారి ని వివరణ కోరగా తాను మండల పరిషత్ సమావేశాలను అడ్డుకోలేదని సక్రమంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తాను ఎక్కడా అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని తెలిపారు.

# ఎల్‌నినోను జయించేలా ప్రకృతి వ్యవసాయం

## తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధ్యం : డీపీఎం మోహన్


సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

పీలేరు జూన్ 22 ప్రభాతవార్త:

ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని, తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని అన్నమయ్య జిల్లా సహజ వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్ పిలుపునిచ్చారు. పీలేరు మండలం బోడుమల్లువారి పల్లి రైతు సేవ కేంద్రం పరిధిలో సోమవారం నిర్వహించిన "రైతన్న మీకోసం" కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల ఏర్పడే ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకోవాలంటే రైతులు సాగు విధానంలో మార్పు తెచ్చుకోవాలని, అధిక నీటిని వినియోగించే పంటలకు బదులుగా పప్పు ధాన్యాలు, కూరగాయలు వంటి తక్కువ నీరు అవసరమయ్యే పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తే నిరంతర ఆదాయం పొందవచ్చునని సూచించారు. యూరియా, రసాయన ఎరువులను అధికంగా వాడటం వల్ల భూసారం దెబ్బతింటుంది. జీవామృతం, ఘన జీవామృతం, పంచగవ్య వంటి సేంద్రియ పద్ధతులు పాటిస్తే ఖర్చు తగ్గడంతో పాటు భూమి ఆరోగ్యంగా ఉండి అధిక దిగుబడులు వస్తాయి. కూటమి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తోందని డీపీఎం మోహన్ వివరించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కరుణాకర్ రెడ్డి, ఎంపీడీఓ శివ శంకర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి, మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి, రైతు సేవ కేంద్రం సిబ్బంది హిమబిందు, సహజ వ్యవసాయ సిబ్బంది శ్రీదేవి, సుబ్రహ్మణ్యం, వెంకటరమణా నాయక్, నాయకులు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోళ్ళ కిషోర్‌నాయుడు రహమతుల్లా, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక గుంతల ఘటనపై బీటెక్ రవి ధ్వజం

## ఇసుక గుంతలు పీఎల్ఆర్ సంస్థ పాపమే.. ఆధారాలతో సహా బయటపెట్టిన బీటెక్ రవి

## బాధిత కుటుంబానికి రూ.20 లక్షల సాయం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బీటెక్ రవి



వేంపల్లె, జూన్ 22, ప్రభాతవార్త,

చక్రాయపేట మండలం అద్దాలమర్రి పాపాఘ్ని నది ఇసుక గుంతల్లో పడి ఇద్దరు బాలురు మృతి చెందిన ఘటనపై పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి తీవ్రంగా స్పందించారు. ఇసుక గుంతలు ఏర్పడటానికి గతంలో పీఎల్ఆర్ సంస్థ చేపట్టిన ఇసుక తవ్వకాలే కారణమని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను గూగుల్ మ్యాప్స్ ద్వారా బయటపెట్టినట్లు తెలిపారు. స్థానిక పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీటెక్ రవి మాట్లాడుతూ.. అమ్మమ్మ ఊరికి వచ్చిన పెండ్లిమర్రి మండలం కారపురెడ్డిపల్లెకు చెందిన 17, 15 ఏళ్ల ఇద్దరు యువకులు ఇసుక గుంతల్లో పడి మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు తన సొంత నిధుల నుంచి రూ.20 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ విషాద ఘటనను రాజకీయాలకు ఉపయోగించుకోవడం సరికాదని, బాధిత కుటుంబాల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని బీటెక్ రవి సూచించారు. వైసీపీ నాయకుల ఆరోపణలపై స్పందిస్తూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక తవ్వకాలపై కూడా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో 20192024 మధ్య కాలంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి లకు చెందిన పీఎల్ఆర్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరిపిందని ఆరోపించారు. ప్రస్తుతం బాలురు మృతి చెందిన ప్రాంతంలో 2023లోనే భారీ ఇసుక గుంతలు ఉన్నట్లు గూగుల్ మ్యాప్స్ ద్వారా తెలుస్తోందని తెలిపారు. బాలురు గల్లంతైన సమయంలో స్థానిక నాయకులు జేసీబీలు, హిటాచీల సహాయంతో మృతదేహాలను వెలికితీశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇసుక తవ్వకాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ల ద్వారా జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఘటనపై కలెక్టర్, మైనింగ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిష్పక్షపాత విచారణ జరగాలని కోరుతున్నామని చెప్పారు. తమ కాంట్రాక్టర్ తప్పు చేసినట్లు తేలితే బాధ్యత వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బాధిత కుటుంబాలు విషాదంలో ఉన్న సమయంలో రాజకీయాలు చేయకుండా సహకరించాలని, ఇలాంటి ఘటనల్లో అందరూ సంయమనంతో వ్యవహరించాలని బీటెక్ రవి కోరారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, టీడీపీ మండల పరిశీలకులు రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామముని రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, టౌన్ క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్, సింగారెడ్డి శివకృష్ణ రెడ్డి, దక్కా రమేష్, యాసిన్, రాజా నాయక్, మడక శ్రీనివాసులు, జబిబుల్లా, గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ విజయ్ కుమార్ ను సన్మానించిన జనసేన సమన్వయకర్త అతికారి క్రిష్ణ



సిద్దవటం జూన్ 22 ప్రభాతవార్త

సిద్దవటం తహసిల్దార్ విజయ్ కుమార్‌ను సోమవారం రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి క్రిష్ణ సన్మానించారు. సిద్దవటం ఆకులవీధిలోని అతికారి క్రిష్ణ నివాసంలో తహసీల్దార్ విజయ్ కుమార్‌కు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సిద్దవటం మండలంలో పరిపాలనకు సంబంధించిన అంశాలు, ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు. తహసీల్దార్ విజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం వివిధ వర్గాల ప్రముఖులను కలుస్తూ సహకారం కోరుతున్నారు. ఈ భేటీ సందర్భంగా మండల అభివృద్ధికి అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్, రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రామయ్య, సింగల్వేండో మాజీ అధ్యక్షులు సుధా మురళి, మాజీ ఉప సర్పంచ్ హిదాయతుల్లా, ఏఎంసీ డైరెక్టర్ మహబూబ్ బాషా, మైనారిటీ నాయకులు గౌస్ బాషా, అతికారి చిన్న వెంకటయ్య, పసుపులేటి గంగయ్య, విజయ్ పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో రక్తదానం చేసి అండగా నిలిచిన పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న



లక్కిరెడ్డిపల్లి: జూన్ 22 ప్రబాత వార్త

మండల పరిధిలోని దప్పేపల్లె గ్రామం జాంద్రపల్లెకు చెందిన బత్తల చంద్రశేఖర్ ,సతీమణి జ్యోతి , రక్తహీనతతో కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా అత్యవసరంగా A+ పాజిటివ్ రక్తం అవసరమైన విషయం తెలుసుకున్న పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న వెంటనే స్పందించి కడప నగరంలోని భోగా పర్వతమ్మ రక్తదాన కేంద్రంలో రక్తదానం చేసి జ్యోతి గారికి అండగా నిలిచారు. అత్యవసర సమయంలో మానవత్వంతో స్పందించి రక్తదానం చేసిన ఎం. అంకన్న, జ్యోతి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మరియు మిత్రులు అభినందిస్తూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.అంకన్న మాట్లాడుతూ, "రక్తదానం ప్రాణదానంతో సమానం. ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణం పోస్తుంది. ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు.

## ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులటరీ మానిటరింగ్ కమిషన్ పునరుద్దరించాలి

### పిటిఎల్యు రాష్ట్ర ప్రధాన కార్య దర్శి గడ్డం రాజు డిమాండ్

ప్రొద్దుటూరు, జూన్ 22 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల పర్యవేక్షణకు చట్టబద్ధంగా ఏర్పాటు చేయబడిన కమిషన్ కు చెర్మన్ మరియు కమిషన్ సభ్యులను ఏర్పాటు చేసి ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల యాజమాన్యల దుర్మార్గలను ఎండగట్టాలని, ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు ఒక్క జీతాలతో పాటు ప్రావిడెంట్ ఫండ్ , ఈఎస్ఐ, గ్రూప్ ఇన్సూరెన్సు, ఇంక్రిమెంట్స్ కూడా ఇవ్వాలని కమిషన్ పేర్కొనిందని తక్షణమే రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు.

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలి

### తహసిల్దార్ శివకుమార్

పీలేరు జూన్ 22 ప్రభాతవార్త:

మండల పరిధిలో జరుగుతున్న ఓటర్ నమోదు కార్యక్రమంలో ఎటువంటి తప్పులు లేకుండా నిర్వర్తించాలని తహసిల్దార్ శివకుమార్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం అకస్మాత్తుగా పీలేరు టౌను రెండవ లైన్లు లత శ్రీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు తీసివేత కార్యక్రమం జరుగుతున్న పనితీరును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు కులమతాలకు తావు లేకుండా అందరిని ఒకే విధంగా నిజాయితీతో ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించాలి. అలా చేయని వారిపై కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో ఆపరేటర్ ముబారక్, రవి తదితరులు పాల్గొన్నారు.



## బి.కోడూరు తహసీల్దార్ కార్యాలయంలో భూకబ్జాలపై ఉన్నత స్థాయి విచారణ జరపాలి



బద్వేలు, జూన్ 22, ప్రభాతవార్త; నియోజకవర్గంలోని బి.కోడూరు మండల తహసీల్దార్ కార్యాలయం భూ ఆక్రమణలు, అవినీతికి కేంద్రంగా మారిందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ ఆరోపించారు. గత తహసీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి హయాంలో జరిగిన ప్రభుత్వ భూముల అక్రమ ఆన్‌లైన్ నమోదు వ్యవహారాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.సోమవారం మండల తహసీల్దార్ రమణమ్మకు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బద్వేల్–పోరుమామిళ్ల ప్రధాన రహదారికి ఇరువైపులా దప్పిలమ్మ నుంచి ఐత్రంపేట వరకు ఉన్న సుమారు 200 ఎకరాల ప్రభుత్వ, ఫ్రీహోల్డ్ భూములను కొందరు బినామీ పేర్లతో ఆన్‌లైన్ చేయించుకుని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. పండ్ల తోటలు, ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుని కోట్లాది రూపాయల విలువైన భూములను కాజేశారని పేర్కొన్నారు. కామకుంట, మున్నెల్లి, కాసానగరం, వేమకుంట ప్రాంతాల్లోని పలు సర్వే నంబర్లలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని ఆరోపిస్తూ, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రెవెన్యూ కార్యాలయానికి సమీపంలో ఉన్న ఏటి పోరంబోకు భూముల ఆక్రమణలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గత ఇన్‌చార్జి తహసీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి హయాంలో జరిగిన భూకబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టి, దప్పిలమ్మ నుంచి ఐత్రంపేట వరకు ఉన్న భూములను రీసర్వే చేయాలని కోరారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని, కబ్జాదారులు మరియు వారికి సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాసానగరంలో మోడల్ స్కూల్‌కు కేటాయించిన ఐదు ఎకరాలు, ఎస్సీ బాలుర వసతి గృహ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో భవనాల నిర్మాణం చేపట్టేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. అధికారులు స్పందించకపోతే అర్హులైన పేదలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కె. జకరయ్య, మండల కార్యదర్శి మార్క్, నాయకులు వెంకట్రామయ్య, మోషే, పుల్లయ్య, బాబు, వెంకటయ్య, వెంగయ్య, ఆర్వైఏ నాయకుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ప్రొద్దుటూరు క్రైం, జూన్ 22, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో ఎరువులు, విత్తనాలు, మందులు అధిక ధరలకు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం సీఐటీయూ జిల్లా కార్యదర్శులు బి.దస్తగిరిరెడ్డి, కె.సత్యంలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రకాల ఎరువులు, మం దులు రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం తీసుకొచ్చిన ఎరువుల యాప్‌ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలని సోమవారం ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖ అగ్రికల్చర్ ఆఫీసు ఎదుట రైతు సంఘం సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. గత ఏడాది ప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్ రైతుల కంటే వ్యాపారులకు ఎక్కువ ఉపయోగపడిందని ఇప్పుడు ఎరువుల అమ్మకంలో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న యాప్‌లో ఎరువులు అనే విధానం రైతులకు ఎరువులు అందకుండా చేసేందుకే ఉపయోగుడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎరువులు అందుబాటులో లేకుండా చేసేందుకు ఈ కొత్త విధానం తెస్తున్నారని రైతు సంఘం భావిస్తోందన్నారు. కావునా యాప్‌లో ఎరువులసరఫరా విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. ధర్నా అనంతరం అగ్రికల్చర్ అధికారి వరహారెడ్డికి వినతిపత్రం అందజేయడం జరిగింది. తక్షణమే విచారించి అధిక రేట్లకు ఎరువులు అమ్ముతున్న వారిపై మరియు నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, బాల దస్తగిరిరెడ్డి, బాలిరెడ్డి చంద్రారెడ్డి, సీఐటీఊ నాయకులు విజయ కుమార్, డీవైఎఫ్ఐ యువజన సంఘం కార్యదర్శి విశ్వనాథ్, రాములమ్మ, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# నిలువుదోపిడి

మొదటి పేజీ తరువాయి

మందు ఒకేరేటు ఉండాలి తప్ప నాలుగు రోడ్ల కూడలిలో బాడుగలు ఎక్కువగా ఉన్నాయని ఒక రేటు, దూరంగా ఉన్న షాపులకు బాడుగలు తక్కువగా ఉంటాయి కాబట్టి తక్కువ రేటు తీసుకోవడం ఏమిటో ప్రజలకే అర్థం కావడంలేదు. పెద్ద పెద్ద షాపులు ఉన్నాయి కదా అని మెడికల్‌షాపులకు వెళితే వారు యాంటి బయాటిక్ ఇస్తున్నాము త్వరగా తగ్గుతాయని చెబుతూ 100 రూపాయలు తీసుకుంటున్నారంటే ఎంత నిలువుదోపిడి చేస్తున్నారో అర్థమవుతుంది. నిబంధనలు తుంగలో తొక్కి మెడికల్ షాపుల యజమానులు ఇష్టానుసారంగా మందుల పేరుతో ప్రజల నుంచి నిలువుదోపిడి చేస్తున్నా అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ప్రభుత్వ దావాఖానాకు వెళ్లాలంటే ఆటోచార్జీలకు ఎక్కువ అవుతాయనే ఉద్దేశ్యంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాలంటే ఎక్కువ తీసుకుంటారనే భయంతో 2 రోజులు మాత్రలు వేసుకుంటే నయమవుతుందనే ఉద్దేశ్యంతో మెడికల్‌షాపులకు వెళితే 10, 20 రూపాయలు విలువ చేసే మందులు వందల రూపాయలు తీసుకుంటూ షాపుల యజమానులు కోట్లకు పడగలెత్తుతున్నారు. మందు విలువ తెలిసినప్పటికీ ప్రజలనుంచి ఎంత తీసుకోవాలో అంత తీసుకోవాల్సింది పోయి నిబంధనలు పాటించకపోవడం లాంటివి జరుగుతున్నా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాత్రం చూస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. తనిఖీల పేరుతో డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ బద్వేలుకు వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పకుండానే వెళ్లిపోవడం జరుగుతుంది. ఒక్క షాపు యజమాని కూడా నిబంధనలు పాటించలేదని తెలిసినప్పటికీ వారిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు.

## మాజీ ఎంపీపీ ప్రసాద్ రెడ్డిని పరామర్శించిన ఎంపీ మిథున్ రెడ్డి



పెద్దమండెం జూన్ 22 ప్రభాతవార్త

మాజీ ఎంపీపీ ప్రసాద్ రెడ్డి ని సోమవారం అతని స్వగృహం మదనపల్లెలో ఎంపీ మిథున్ రెడ్డి వైసీపీ నాయకులు పరామర్శించారు. గత నెలలో ప్రసాద్ రెడ్డి కుమారుడైన శ్రీకాంత్ రెడ్డి ఆఫ్రికాలోని కాంగో దేశం లో గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఎంపీపీ ప్రసాద్ రెడ్డిని పరామర్శించడానికి మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి వైసీపీ కన్వీనర్ మిస్బార్ రహమాన్ మున్సిపల్ చైర్మన్ మనుజా రెడ్డి వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి షమీము అసలం మాజీ ఎంపీపీ రెడ్డి శేఖర్ రెడ్డి . ఖాదర్ వైట్ మధుకర్ ఆచారి తదితర నాయకులు పరామర్శించి శ్రీకాంత్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం కొడుకు మృతి చెందాడు అన్న మనోవేదనను వీడి ధైర్యంగా ఉండాలని దైవ నిర్ణయాన్ని మనము మార్చలేము ఎంతవరకు బ్రతకాలని ఉందో అంతవరకే మన చేతుల్లో ఏమీ లేదని ప్రసాద్ రెడ్డికి ధైర్యం చెప్పారు

## మందకృష్ణ పిలుపుతో మాదిగ జాతి బిడ్డల భవిష్యత్తుకు పునాది

### వేటా మల్లికార్జున



తంబళ్లపల్లె జూన్ 22 ప్రభాతవార్త

రాజ్యాంగ సృష్టికర్త దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో మాదిగ రిజర్వేషన్ల సాధన కర్త మందకృష్ణ మాదిగ పిలుపు, అధికార ప్రతినిధి నరేంద్ర మాదిగ సూచనలతో ప్రతి దళితవాడ జల్లెడ పట్టి మాదిగ బిడ్డల చదువు కోసం తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ తంబళ్లపల్లె ఇంచార్జ్ వేటా మల్లికార్జున తెలిపారు. సోమవారం మండలంలోని ఆర్ ఎన్ తాండ , కొటాల దళి త వాడల్లో మాదిగ కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులకు చదువు యొక్క ఉప యోగాల పై అవగాహన కల్పించి నేటి ఆధునిక సమాజంలో చదువుతో విజ్ఞా నంతో పాటు వికాసం, ఆర్థిక సమానత్వం, సమాజంలో గౌరవం, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరడానికి మూల కారణమని హితవు పలికారు. దళితవాడలోని ప్రతి విద్యార్థిని కచ్చితంగా బడికి పంపించి ఉన్నత చదువులు చదవడానికి మీరు సమిధలుగా మారి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. వారి వెంట ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, దళిత కుటుంబాల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లె కోనేరు మరమ్మత్తు పనులకు శ్రీకారం ; ఎంపీడీవో ఉషారాణి



తంబళ్లపల్లె జూన్ 22 ప్రభాతవార్త ః

రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పురాతన కోనేరు పుష్కరిణిల అభివృద్ధిలో భాగంగా తంబళ్లపల్లె నడిబొడ్డున గల పురాతన కోనేరు ఎంపికై అభివృద్ధి పనులు చేపట్టడం హర్షనీయమని ఎంపీడీవో ఉషారాణి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం అభివృద్ధి పనులకు ఎంపీడీవో తో పాటు మండల టిడిపి అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, సిద్ధమ్మలు పూజలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు.టిఎన్ కుటుంబీకుల హయాంలో ఓ వెలుగు వెలిగిన కోనేరు సుమారు 7 లక్షల ఉపాధి నిధులతో కోనేరు లో ముండ్ల చెట్ల తొలగింపు, ప్రహరీ గోడ నిర్మాణం తోపాటు గేట్లు, లోపల మరమ్మత్తు పనులు చేపట్టనున్నట్లు ఉపాధి హామీ ఎపిఓ అంజనప్ప తెలిపారు. కూటమి ప్రభుత్వం పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పరుగులు పెడుతున్నాయని కోనేరును అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకువస్తామని టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు ఎంవి ప్రసాద్, మారుతీ కుమార్, ఏపీవో అంజనప్ప, పి ఆర్ ఏ ఈ వెంకటరమణ, టెక్నికల్ అసిస్టెంట్ బాలగంగాధర్,కార్యదర్శి శ్రీనివాసరావు,మండల ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, కాలా నారాయణ, రామచంద్రారెడ్డి, సుధాకర్, కన్నె మడుగు సురేంద్ర, గోపి దీన్ని సుధాకర్, శ్రీనివాసులు,జనసేన ఎద్దుల నరసింహులు, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SYED ASAF ALI (Old Name), S/o Late SYED RAHIM SAHEB, R/at D.No. 4-47, Gaddamvari Street, Kurabalakota P&M, Annamayya Dist, AP – 517350, have changed my name to SYED ASHRAF ALI (New Name) for all purposes. Henceforth, I shall be known as SYED ASHRAF ALI.

# నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలి

## ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 22 ప్రభాతవార్త : నిరుద్యోగ సమస్యలను పరిష్క రించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయన్, వెంకటేష్ లు డిమాండ్ చేశారు. సోమవారం నిరుద్యోగ సమస్యలపై జిల్లా కలెక్ట ర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్వహించే అన్ని రకాల ఉద్యోగ నియా మక ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. డీఎస్‌సి నియామకాల్లో అనే క అవకతవకలు జరిగాయన్న అభిప్రాయాలను ఎక్కువ అయ్యాయన్నారు. నిరుద్యో గులకు నిరుద్యోగబృతిని నెలకు రూ.10వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఫోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తూ నెలకు వారికి రూ.10వేలు వేతనం ఇవ్వాలన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు వయోపరిమితిని పెంచాలన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓబులేసు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏస్టేట్‌లో భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

## బహుజన యువసేన నాయకులు డిమాండ్



మదనపల్లె, జూన్ 22 ప్రభాతవార్త : మదనపల్లె ఇండస్ట్రియల్ ఏస్టేట్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై కఠినచర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షులు పునిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన పిజిఆర్ఎస్‌లో భూ ఆక్రమణలపై బహుజన యువసేన నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ఏస్టేట్‌లో గతంలో ప్లాట్లు కేటాయించబడి ఇప్పటికి పరిశ్రమలు నడుపుతున్న కొందరు వ్యక్తులు తమ హద్దులను దాటి పక్కన, ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఏపిఐఐసి ఖాళీ పాట్లను చట్టవిరుద్ధంగా ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ఎటువంటి అదనపు కేటాయింపు పత్రాలు లేకుండా రాత్రికి రాత్రే భారీ యంత్రాలతో భూమిని తవ్విస్తూ అనధికారికంగా శాశ్వత నిర్మాణ పనులు సాగిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ, ఏపిఐఐసి అధికారులతో మాస్టర్‌ప్లాన్ ఆధారంగా క్షేత్రస్థాయిలో సరిహద్దులు సర్వే నిర్వహించి చట్టబద్ధంగా సాగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి భూ ఆక్రమణలో పాల్పడుతున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉపాధి కల్పించవచ్చునన్నారు.

# కృత్రిమకాలు పరికరాల కోసం నమోదు చేసుకోండి

మదనపల్లె, జూన్ 22 ప్రభాతవార్త : దివ్యాంగులకు ఉచిత ఆధునిక కృత్రిమ కాలు(హార్టిఫిషియల్ లిప్స్) అమరిక కోసం పేర్లు నమోదు చేసుకోవాలని వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి క్రిష్ణకిశోర్, వెలుగుస్కూల్ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి ఆదేశాల మేరకు ఉచిత ఆదునిక కృత్రిమకాలు అవసరమైన ప్రతి దివ్యాంగులు, దివ్యాంగురాలు తన పేరు ను నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం బిఎం.రమేష్, డి.రమేష్ సెల్‌నెం బర్లు 807423993, 9182778324లను సంప్రదించాలని కోరారు. ఈ అవకా శాన్ని ప్రతి దివ్యాంగుడు, దివ్యాంగురాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# అంగన్వాడీ ఆయా పోస్టుల రోస్టర్ లోపాలను సరిచేసి వెంటనే రీనోటిఫికేషన్ విడుదల చేయాలి



లక్కిరెడ్డిపల్లి: జూన్ 22, ప్రభతవార్త : అంగన్వాడీ ఆయా పోస్టుల రోస్టర్ లోపాలను సరిచేసి వెంటనే రీనోటిఫికేషన్ విడుదల చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగల శ్రీనివాసుల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి అంగన్వాడీ ప్రాజెక్టు పరిధిలో 17 అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో తీవ్ర రోస్టర్ లోపాలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎస్సీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీసీ రోస్టర్ కేటాయించడం, బీసీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎస్సీ రోస్టర్ కేటాయించడం వల్ల అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకునే అవకాశాలను కోల్పోతున్నారని ఆయన తెలిపారు. ఈ విధంగా తప్పుల తడకగా నోటిఫికేషన్ విడుదల చేయడం వల్ల స్థానిక అభ్యర్థులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం పారదర్శకత, సామాజిక న్యాయం, రిజర్వేషన్ విధానాల అమలుకు కట్టుబడి ఉందని చెబుతూనే, క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. రోస్టర్‌లో ఉన్న లోపాలను వెంటనే సవరించి, గ్రామాలు – కేటగిరీలు – రిజర్వేషన్ వివరాలను స్పష్టంగా పేర్కొంటూ కొత్తగా రీనోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లోపభూయిష్టమైన నోటిఫికేషన్ కారణంగా ఏ ఒక్క అభ్యర్థి కూడా నష్టపోకూడదని, దరఖాస్తుల గడువును కూడా పొడిగించాలని కోరారు. జిల్లా కలెక్టర్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు ఈ సమస్యను అత్యవసరంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఏఐటీయూసీ సీపీఐ ఆధ్వర్యంలో బాధిత మహిళలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



రామసముద్రం, జూన్ 22 ప్రభాతవార్త రామసముద్రం మండల ఎస్‌టియూ ఆధ్వర్యంలో సోమవారం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యా ర్థులు 62 మందికి నోటు పుస్తకాలు , విద్యాసామాగ్రి ను ఉచితంగా అందజేశారు. ఎస్టియు మండల అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ఎనిమిది వేల రూపాయల విలువచేసే విద్యా సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. అయూబ్ ఖాన్ మాట్లాడుతూ ఎస్ టి యూ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఓ పాఠశాలను ఎంపీక చేసుకుని ఆ పాటశాల విద్యార్థులకు తమవంతు సాయంగా విద్యాసామగ్రి ఉచితంగా అందిస్తున్నామ న్నారు. విద్యా కమిటీ చైర్మన్ నాగభూషణం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న సహకారం మరువలేనిదని ,ఇలాంటి ఉపాధ్యాయులు తమ గ్రామంలో పనిచేయడం తమ అదృష్టమని కొనియాడారు ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రధానోపాధ్యాయురాలు షాహిర, ఉపాధ్యాయులు రెడ్డి నీలాంబ, హరీష్, కమిటీ సభ్యులు అమరప్ప, సుజ్ఞాన మూర్తి, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులుగా డి.సుబ్రహ్మణ్యం

రామసముద్రం జూన్ 22 ప్రభాతవార్త రామసముద్రం మండల బి జె పి ఓ బిసి మోర్చా అధ్యక్షులు గా డి. సుబ్రహ్మణ్యం ను నియమించారు ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు ఇంజం ఆనంద్ కుమార్ నాయుడు, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, మండల జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు కె మంజునాథ్, యువ మోర్చా వీరభద్ర, భానుప్రకాష్, మధు, మహేష్, సురేంద్ర తదితరులు పాల్గొనడం జరిగింది. సోమవారం ఓబీ సి అధ్యక్షులు గా ఎన్నికైన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఓబీసీ మోర్చా అధ్యక్షులు బాధ్యత ఇచ్చినందుకు మండల పార్టీ, జిల్లా పార్టీ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ పోలింగ్ భూత్ స్థాయి నుండి ఓబీసీ వర్గాలకు విద్య, నైపుణ్యాభిరుద్ధి, ఉపాధి లో యువతకు సహకరిస్తూ అర్హులకు సంక్షేమం అందేటట్టు చూస్తానన్నారు .ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# 24 నుంచి ఏపీ పాలీసెట్-2026 తొలి దశ వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తిరెడ్డి



ప్రొద్దుటూరు క్రైం, జూన్ 22, ప్రభాతవార్త: ఏపీ పాలీసెట్-2026లో అర్హత సాధించిన అభ్యర్థులకు రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమో కోర్సుల ప్రవేశాల కోసం తొలి దశ వెబ్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల ఆన్‌లైన్ వెరిఫికేషన్‌ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు ధ్రువీకరించని లేదా సవరణలు అవసరమైన అభ్యర్థులు నోటిఫైడ్ హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఈనెల 25 నుంచి జులై 1వ తేదీ వరకు హాజరు సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియలో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సంప్రదిస్తే వెంటనే తగిన సహాయ సహకారాలు, అవసరమైన అవగాహన కల్పించడం జరుగుతుందని ప్రిన్సిపల్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు జూన్ 29 నుంచి జులై 3 వరకు వెబ్ ఆప్షన్లు మార్పులకు అవకాశం ఉంటుందని తెలిపారు. జులై 6న సీట్ల కేటాయింపు జరుగును, సీట్లు పొందిన అభ్య ర్థులు జులై 7 నుంచి 10వ తేదీ మధ్య సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుం దన్నారు. జులై 7 నుంచి తరగతు లు ప్రారంభమవుతామన్నారు. కౌన్సెలింగ్ ఫీజుగా ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.250 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వెబ్‌కౌన్సెలింగ్ విధానం, యూజర్ మాన్యువల్‌తో పాటు ఇతర పూర్తి వివరాలు పాలీసెట్.ఏపీ.గో.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

# అవినీతి అక్రమాలకు గొడ్డలి పార్టీ బ్రాండ్ అంబాసిడర్

## రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య



ఒంటిమిట్ట, జూన్ 22, ప్రభాతవార్త : రాష్ట్రంలో అవినీతి అక్రమాలకు భూ కబ్జాలకు ప్రకృతి వనరుల దోపిడీలకు గొడ్డలి పార్టీ బ్రాండ్ అంబాసిడర్ అని రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య అన్నారు. సీనియర్ టిడిపి కార్యకర్తలతో సోమవారం ఆయన పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన సమావేశంలో మాట్లాడుతూ దోపిడీతనానికి గొడ్డలి పార్టీ పెట్టింది పేరని విమర్శించారు. గొడ్డలి పార్టీ నాయకులు నిర్వహించే నిరసనలకు కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పవలసిన అవసరం లేదన్నారు. రెండు సంవత్సరాల పరిపాలనలో ప్రధానమైన పది రంగాలలో జరిగిన అభివృద్ధి ప్రగతి నివేదిక తయారు చేసేందుకు రాష్ట్ర మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి కమిటీని నియమించడం హర్షించదగ్గ విషయం అన్నారు. పేదలకు 4000 నుంచి 15 000వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమే అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు గత ప్రభుత్వంలో జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియక అయోమయ పరిస్థితిలో ఉండే వారిని కానీ ప్రస్తుత ప్రభుత్వం లో కచ్చితంగా ఒకటో తేదీ జీతం రావడం సంతోషకరమన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి అంధకారంలో ఉందన్నారు. రాష్ట్రంలో పె ట్టుబడి పెట్టాలంటే రాచరిక పరిపాలన చూసి భయపడి పెట్టుబడిదారులు వేరే రాష్ట్రాలకు వెళ్లిన దుస్థితి కలిగిందన్నారు. ఆ ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి జరిగిందో లేదో అని చెప్పడానికి ఆ పార్టీ నాయకులే చెప్పలేని దుస్థితి వాటిల్లిందన్నారు. చేతకాని వైసిపి నాయకుల వల్ల ఇసుక దోపిడీలు ఎక్కువై అన్నమయ్య ప్రాజెక్టు వరదల్లో కొట్టుకపోయిందన్నారు. వేలకొలది ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతుల్లో పడి బందీగా ఉన్నాయన్నారు. ఇదంతా వైసీపీ నాయకుల ఘనకార్యం అన్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములన్నీ మరలా స్వాధీనం చేసుకొని పేదలకు పంచే కృత నిశ్చయంతో పార్టీ పనిచేస్తుందన్నారు. త్వరలో వివరాలన్నీ పత్రికా ముఖంగా వెల్లడి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందలేదని ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు రోడ్డెక్కి వెన్నుపోటుకు రెండేళ్ల అనే కార్యక్రమం నిర్వహించడం సిగ్గుచేటు అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసం ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు అర్థమైందన్నారు. రోడ్లెక్కి అరుస్తున్న నాయకులు తమ ఐదు సంవత్సరాల ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఎంత మాత్రం అభివృద్ధి చెందిందో పత్రికల ముఖంగా బహిరంగంగా సమాధానం చెప్పాలన్నారు. నాయకులు ఎవరైనా సరే విమర్శించేటప్పుడు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు మామిళ్ళ. ఈశ్వరయ్య ,పామూరు. సుబ్రమణ్యం, రామ్మోహన్ నాయుడు ఉన్నారు.

# ప్రపంచ సూచీలలో అట్టడుగు స్థాయిలో భారత్ ఉండడం శోచనీయం

## డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



వేంపల్లి, జూన్ 22 ప్రభాతవార్త ఒకవైపు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అచ్చేదిన్, వికసిత భారత్, సబ్కా వికాస్,స్వర్ణ భారత్ అంటూ ఉంటే మరొకవైపు దాదాపు అన్ని ప్రపంచ సూచీలలో భారతదేశం అట్టడుగు స్థాయిలో ఉండడం శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ప్రపంచ శాంతి సూచి ఇన్స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ సంస్థ 2026వ సంవత్సరానికి సంబంధించి 163 దేశాలలో ప్రపంచ శాంతి సూచికి అనగా గ్లోబల్ పీస్ ఇండెక్స్ కు సంబంధించి నివేదిక సమర్పించింది.అందులో ఐస్లాండ్ మొదటి స్థానంలో, న్యూజిలాండ్ రెండవ స్థానంలో, స్విట్జర్లాండ్ మూడవ స్థానంలో రాగా నేపాల్ 111వ స్థానంలో, బంగ్లాదేశ్ 117 వ స్థానంలో రాగా భారతదేశం 127 వ స్థానంలో ఉండడం శోచనీయమని తులసి రెడ్డి అన్నారు. తలసరి ఆదాయంలో 142వ స్థానంలో, ఆకలి సూచికలో 101 వ స్థానంలో, మానవాభివృద్ధి సూచికలో 130 వ స్థానంలో, సంతోష సూచికలో 144 స్థానంలో ఉన్నదని తులసి రెడ్డి వివరించారు.ఇప్పటికైనా గొప్పలు చెప్పుకోవడం,సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడం మానుకోవాలని తులసి రెడ్డి మోడీ ప్రభుత్వానికి సూచిం చారు. ఫీజు రీయింబ ర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ పథకాల కింద రాష్ట్రంలో 6400 కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కళాశాల యాజ మాన్యాలు కళాశాలలు నిర్వహించలేక ఇబ్బంది పడు తున్నాయి . ఫీజు చెల్లించాలని విద్యార్థుల మీద ఒత్తిడి చేస్తున్నాయి.ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వని కారణంగా విద్యార్థులు పై చదువులకు పోలేక,ఉద్యోగాన్వేషణ చేయలేక ఇబ్బంది పడుతున్నారు.కాబట్టి వెంటనే పెండింగ్ బకాయిలు 6400 కోట్ల రూపాయలు విడుదల చేయాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సర్ ద్వారా వైసీపీ ఓట్లు తొలగించేందుకుకుట్ర

## వైకాపా నాయకులు జాగ్రత్తగా ఉండాలి : ఎంపీ మిథున్ రెడ్డి



మదనపల్లి, జూన్ 22 ప్రభాతవార్త వైయస్ఆర్ సీపీకి చెందిన ప్రతి ఓటును కాపాడుకోవాలి, మన ఓట్లను తొలగించేలా టిడిపి నాయకులు కుట్ర పన్నుతున్నారు,స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో జాగ్రత్తగా ఉండాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సూచించారు. సోమవారం మదనపల్లి నియోజ కవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లి, మదనపల్లి రూరల్ మండలా లతో పాటు, మదనపల్లి మున్సిపాలిటీలోని వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ కన్వీనర్లు, ఇతర ముఖ్య నాయకులతో ఎంపీ మిథున్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వ యకర్త నిస్సార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్ కుమార్ రెడ్డి,మదన పల్లి మున్సిపల్ మాజీ చైర్పర్సన్ మనూజ రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శేషాచలపతి నాయుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్లు జింక వెంకటా చలపతి, నూర్ అజాం, మదనపల్లి నియోజకవర్గ వైసిపి యూ త్ అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. తొలుత మదనపల్లి మున్సి పాలిటీలోని 35 వార్డులకు సంబంధించి మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జ్ లు, తర్వాత నిమ్మనపల్లి మండలానికి సంబంధించి కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, మాజీ మండల కన్వీనర్ ఆర్ ఐ రమణారెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు రెడ్డి శేఖర్ రెడ్డి, మదనపల్లి రూరల్ మండలం కు సంబంధించి కన్వీనర్ దండు కరుణాకర్ రెడ్డి, సిటిఎం మాజీ సర్పంచ్ ఆనంద పార్థసారథి, మాజీ కన్వీనర్ బోర్వెల్ మహేష్, వెలుగు చంద్ర, బూత్ కమిటీ అధ్యక్షులు చిప్పిలి మల్లికార్జున రెడ్డి, కొత్తపల్లి మహేష్, చివరగా రామసముద్రం మండల సమావేశాన్ని కన్వీనర్ కేశవ రెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి, మాజీ కన్వీనర్ లు భాస్కర్ గౌడ్, వైసిపి ముఖ్యనేత అరికెల జయరామిరెడ్డి, నరసాపురం తిమ్మయ్య, రాధారెడ్డి, యూత్ అధ్యక్షులు బాలాజీలతో ప్రత్యేకంగా ఎంపీ సమావేశం అయ్యా రు. గ్రామం,వార్డులో ఉంటున్న ప్రతి వైసిపి ఓట్లను కాపాడుకునేలా అతి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా బిఎల్ఏలను అప్రమత్తం చేసి ఎక్కడ గాని ఓట్లు తీసివేయకుండా, మన ఓట్లను కాపాడుకునే బాధ్యత ప్రతి వైసిపి నాయకులు పైన ఉందని తెలియజేశారు. ప్రతి ఓట రు మూడు ఆధారాలు ఇచ్చి తమ ఓటును తిరిగి పొందాలని తెలిపారు. ఫారం 7 పేపర్ ను జాగ్రత్తగా పరిశీలించి, ఓట్లు ఉన్నాయా, తొలగిం చబడ్డాయా సరిచూసుకోవాలన్నారు. ఒకసారి ఓటర్ లిస్ట్ నుండి పేరు తొలగిస్తే తిరిగి పొందడం చాలా కష్టమన్నారు. ఏదైనా సమస్య ఉంటే తిప్పారెడ్డి, నిస్సార్ అహ్మద్, నరేష్ కుమార్ రెడ్డి దృష్టికి తేవాలని తెలి పారు. సమస్య ఎక్కువగా ఉన్నచోట తన దృష్టికి తెస్తే వాటిని పరిష్కా రం చేసేలా తాను చర్యలు తీసుకుంటానని సూచించారు. ఈ కార్యక్ర మంలో వైఎస్ఆర్సిపి మేధావుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మయూ రి రఘునాథ్ రెడ్డి, కార్యదర్శి విఎస్ రెడ్డి, వైయస్సార్సీపి రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లికార్జున, మార్కెట్ కమిటీ మాజీ చైర్మ న్ తట్టి శ్రీనివాసులు రెడ్డి, వైసీపీ రాష్ట్ర నాయకులు ఎస్ఎ కరీముల్లా, షేక్ ఇర్ఫాన్,తట్టి నాగరాజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పల్స్‌పోలియో వాక్సినేటర్స్ శిక్షణా కార్యక్రమం



పెండ్లిమర్రి, జూన్ 22, ప్రభాతవార్త: పెండ్లిమర్రి పీహెచ్‌సీ నందు ప్రాథమిక వైద్యాధికారి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సంద ర్భంగా డా.జేవీఆర్ ప్రసాద్ మాటా ్డుతూ పల్స్ పోలియో ప్రోగ్రాం జూన్ 28, 29, 30న జరుగుతుందని 0-5 సంవత్సరాల పిల్లలం దరికీ పోలియో చుక్కలు అందించి పోలియో జబ్బు నుంచి రక్షణ కల్పించాలి. ఒక్క బిడ్డ కూడా మిస్ కాకుండా వంద శాతం పిల్లలకు పోలియో చుక్కలు అందించాలని తెలిపారు. డిప్యూటీ హెచ్ఈవో శ్రీదేవి మాట్లాడుతూ పెండ్లిమర్రి పీహెచ్‌సీ పరిధిలో 29 పల్స్ పోలియో సెంటర్స్ 1 మొబైల్ బూతు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి బూత్ నందు వాక్సిన్ వేయడానికి 4ని నియమించడం జరిగిందని 28న బూతు నందు చుక్కలు వేస్తారని ఏ కారణం చేత కానీ కవర్ కానీ పిల్లలకు 29న మరియు 30వ తేదీన గృహ సందర్శనలో చుక్కల వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో తిమ్మారెడ్డి, సూపర్‌వైజర్లు, సీహెచ్ఓలు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# భర్త నుంచి రక్షణ కల్పించాలంటూ ఎస్పీకి ఫిర్యాదు

మదనపల్లెక్రైం, జూన్ 22 ప్రభాతవార్త. భర్త నుంచి తనకు రక్షణ కల్పించాలంటూ ఓ యువతి అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్‌కు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లక్కిరెడ్డిపల్లి మండలం, మద్దిరేవుల పంచాయతీ, అప్పలరాజుగారి పల్లెకు చెందిన రామరాజు ట్రాన్స్‌కోలో కాంట్రాక్టు లైన్మెన్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య ఎస్.లలిత 2014లో బిడ్డల్ని పుట్టినింటిలో వదలి బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లి 2019లో తిరిగి వచ్చింది. ఆ సమయంలో తాను సంపాదించిన 60 గ్రాముల బంగారం, రు. 5 లక్షల నగదు భర్తకు పంపటం జరిగిందన్నారు. అయితే తన భర్త తాను పంపిన బంగారు డబ్బులను విలాసాలకు ఖర్చు చేసి, మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ తనపైనే నిందలు వేస్తున్నాడని ఆరోపిం చింది. తనను హతమార్చడానికి భర్త రామరాజుతో పాటు అతని స్నేహితులు గజపతిరాజు, అంజితో కలిసి కుట్ర పన్నారని ఆరోపించింది. దీంతో తాను మూడు నెలల క్రితం కాకులారంలోని పుట్టింటికి వచ్చానని, తన భర్త అక్కడ కూడా వచ్చి వేధింపులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు తనకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు న్యాయం చేయకపోతే ఆత్మహత్య శరణ్యమన్నారు.

# కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

## మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసనలు



మదనపల్లె, జూన్ 22 ప్రభాతవార్త : మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ స్యలను పరిష్కరించాలని సోమ వారం మదనపల్లె మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా యూని యన్ నాయకులు మస్తాన్, జిల్లా కార్యదర్శి దేవాలు మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం రెండేళ్ళ పాలన పూర్తియిన సందర్భంగా విజయోత్సవ సభలు నిర్వహిం చడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, డైలీవేజిస్ కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికి ప్రభుత్వం వారి పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టలేద న్నారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. 12వ పిఆర్‌సి అమలు చేసి పెండింగ్‌లో ఉన్న డిఏలను విడుదల చేయాలని డి మాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే ఇంటివరకు ర్యాలీ చేపట్టి నిరసనలు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు తిరుమలప్ప, ఇంద్రా ణి, జానకి, రాధ, నరసింహులు, మల్లికార్జున, శంకర తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



లక్కిరెడ్డిపల్లి, జూన్ 22, ప్రభాతవార్త ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదన్ మోహన్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చౌటపల్లి గ్రామం ఆర్‌బికే నందు లక్కిరెడ్డిపల్లి మండల అధ్యక్షుడు యనమల మదన్మోహన్ ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్ కొరకు వేరుశనగ విత్తన కాయలు మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్ తో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ కొరకు మండలానికి 1900 క్వింటాల వేరు వేరుశనగ విత్తన కాయలు మండలానికి కేటాయించారన్నారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలును ఆర్బికే కార్యాలయంలో చూపించి 3150 విలువగల విత్తన కాయలు 40 శాతం సబ్సిడీతో 1890 రూపాయలకు పొందాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని ప్రజల శ్రేయస్సు కొరకు ఎప్పుడు పాటుపడుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇటీవల కాలంలో ఖరీఫ్ కొరకు రైతు భరోసాను రైతుల అకౌంట్ లో నేరుగా డబ్బులు జమ చేయడం జరిగిందని రైతులు ఇబ్బంది పడకుండా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతులు పక్షపాతిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిల్చారని కొనియాడారు. మండలానికి ఇంకా అవసరమైన వేరుశనగ విత్తన కాయలు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డితో మాట్లాడి ఖరీఫ్ సీజన్ కొరకు అవసరమైన విత్తనాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని రైతులకు ఎలాంటి అవసరమైనటువంటి విత్తన కాయలు సరఫరా చేసేటందుకు మంత్రి సోదరులు అధికారులతో మాట్లాడి పంపిణీ చేసేటందుకు సిద్ధంగా ఉన్నారని కావున రైతులు ఆదేర్య పడకుండా ఖరీఫ్ కొరకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ . ఓ. రాజకుమారి తో పాటు మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శంకర్, వెంకటేష్, దేవా, ఆర్ బి కే అధికారులు, ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బందితోపాటు రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజంపేట ఎంపి పి.వి. మిథున్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన మండల వైసీపీ నాయకులు



రామసముద్రం, జూన్ 22, ప్రభాతవార్త రాజంపేట పార్లమెంట్ సభ్యులు పి.వి. మిథున్ రెడ్డిని మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మదనపల్లి వైసీపీ పార్టీ కార్యాలయం లో పుష్ప గుచ్చం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వైసీపీ మండల నాయకులను సర్ కార్యక్రమం, పార్టీ కార్యకలాపాలు, కార్యకర్తల పరిస్థితుల గురించి మిథున్ రెడ్డి అడిగి తెలుసుకున్నారని తెలిపారు. అనంతరం మండలంలో ఎదుర్కొంటున్న సమస్యలను మిథున్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఎంపి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.త్వరలో మండల పర్యటనకు వస్తానని తెలిపారని వైసీపీ నాయకులు తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల వైసీపీ పార్టీ అబ్జర్వర్ తట్టి శ్రీనివాసులు రెడ్డి,మండలం వైసీపీ పార్టీ అధ్యక్షులు కేశవరెడ్డి, ఎంపిపి రమణారెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు జయరామిరెడ్డి, భాస్కర్ గౌడ్,జిల్లా బిసి నాయకులు తిమ్మయ్య,తిమ్మారెడ్డి నందకిశోర్ రెడ్డి,బుడ్డారెడ్డి,రాధారెడ్డి,యూత్ వింగ్ అధ్యక్షు లు బాలాజీ,కృష్ణప్ప, నారాయణ స్వామి, భాస్కర్,శివ అంబరీష్,శ్రీనివాసులు రెడ్డి రమణారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# చెంబకూరులో గురుప్రసాద్ మెమోరియల్ టోర్నమెంట్

రామసముద్రం, జూన్ 22 ప్రభాతవార్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గురు ప్రసాద్ గుర్తుగా గురు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ చెంబకూరు గ్రామంలో గొప్పగా నిర్వహించాలని గురు ప్రసాద్ స్నేహితులు గురు మెమోరియల్ టోర్నమెంటును నిర్వహిస్తున్నారు . ఈ టోర్నమెంట్ బాగంగా మొదటి బహుమతి 30000, రెండో బహుమతి 20000, మూడో బహుమతి 10000, నాలుగో బహుమతి 5000, గా ప్రకటించడం జరిగింది. ఈ టోర్నమెంటుకు ఎవరైనా పాల్గొనచ్చని ఏ రాష్ట్రాల ఆయన పాల్గొనడానికి అవకాశం ఉన్నదని టోర్నమెంట్ ఉచిత ఎంట్రీ తో క్రికెట్ ఆడి ప్రైజ్ మనీ గెల్చుకోవాల్సిందిగా గురు ప్రసాద్ స్నేహితుడు తెలియజేశారు. ఈ టోర్నమెంట్ 26 తేదీన శుక్రవారం ప్రారంభం కానున్నదని, ఆదివారం ఫైనల్ మ్యాచ్ ఉంటున్నదని తెలియచేసారు.ప్రతిరోజు క్రీడాకారులకు , ప్రేక్షకులకు భోజన సౌకర్యం కూడా కలిగిస్తూ నిర్వాహకులు తెలియ చేసారు.

# నిమ్మనపల్లె పదవ తరగతిలో టాపర్‌కు నగదు బహుకరణ



నిమ్మనపల్లె జూన్ 22 ప్రభాతవార్త పదవ తరగతిలో మండల్ సెకండ్ టాపర్‌గా నిలిచిన యం. లావణ్యను అభినందిస్తూ గతంలో ప్రాథమిక విద్య అభ్యసించినందుకు మండ్యంవారి పల్లె పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు రాటకొండ వాణి (ప్రస్తుత పాఠశాల దిగువపల్లి నందు పని చేస్తున్నారు) మండల విద్యాశాఖ అధికారి పద్మావతి ద్వారా 25,000 రూపా యల నగదు సహాయం విద్యార్థికి అందజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పద్మావతి, నిమ్మనపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థి తండ్రి పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు కరెంటు వైర్ తగిలి తండ్రీకొడుకులకు గాయాలు



ముద్దనూరు, జూన్ 22 ప్రభాతవార్త: ముద్దనూరు పట్టణంలోని పులివెందుల రహదారిలో ఇటుకల బట్టీ సమీపంలో సోమవారం ఉదయం జేసీబీతో రాళ్లు, కంప చెట్లను తొలగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కరెంటు వైర్ తగిలి తండ్రీకొడుకులు గాయపడ్డారు. ఈ ఘటనలో రాజాపాటి బాబయ్య తీవ్రంగా గాయపడగా, ఆయన కుమారుడు కులయప్ప స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గాయపడిన వారిని వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వాహనంలో పొద్దుటూరుకు తరలించగా, అక్కడి వైద్యుల సూచన మేరకు రాజాపాటి బాబయ్యను మరింత మెరుగైన చికిత్స నిమిత్తం కడపకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ



**కాశినాయన జూన్ 22 ప్రభాతవార్త :** కాశి నాయన మండల పరిధి లోని మూలపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం రోజు 30 మంది విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మూలపల్లి ప్రాథమిక పాఠశాలలో కీ.శే.పసుపులేటి వెంకటమ్మ (సంటెమ్మ) సేవా సంస్థ నిర్వాహకులు శ్రీ జి.వీ. రమణ (అమెరికా) వారు మా పాఠశాలలోని 30 మంది విద్యార్థిని ,విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు అందించడం జరిగింది. ఉచిత నోట్ పుస్తకాలు అందించుటలో మాకు సహకరించిన సంస్థ సహాయ కార్యనిర్వాహకులు గౌరవనీయులు జి. శ్రీనివాసులు, వీరి సతీమణి సుహాసిని గార్ల తరఫున మా పాఠశాల విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మిద్దెల పంచాయతీ సెక్రటరీ పాండురంగ చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ ప్రతినిధులైన జి వెంకటరమణని వారు కొనియాడారు. విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అన్నారు. అనంతరం ముఖ్య అతిథి పంచాయతీ సెక్రటరీ గారు మరియు తల్లిదండ్రులు విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ చంద్రశేఖర ఆచారి, ఉపాధ్యాయురాలు కళావతి, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదపుటంచుల్లో చౌడేపల్లి బస్‌షెల్టర్



పెచ్చులూడుతున్న బస్‌షెల్టర్

**చౌడేపల్లి, జూన్ 22 ప్రభాతవార్త** మండల కేంద్రమైన చౌడేపల్లి బస్టాండులో బస్‌షెల్టర్ శిధిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా వుంది. దీంతో ప్రయాణీకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పుంగనూరు, బోయకొండకు వెళ్ళే ప్రయాణీకులు అధిక సంఖ్యలో బస్‌షెల్టర్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే షెల్టర్ పైకప్పు పెచ్చులూడి కిందకు పడుతోంది. ఇటీవల పెచ్చులు తలపై పడి ప్రయాణీకులు క్షతగాత్రులయ్యారు. రానున్నది వర్షాకాలం కాబట్టి ప్రయాణీకులు షెల్టర్ కిందకు రావాలంటేనే భయపడుతున్నారు. అధికారులు స్పందించి శిధిలావస్థలో వున్న బస్‌షెల్టర్‌ను మరమ్మత్తు చేయించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

## నియోజకవర్గంలో వైకాపా పార్టీని బలోపేతం చేయండి

**మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**



**పీలేరు, జూన్ 22, ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి గ్రామంలో వైకాపా పార్టీ జెండా పీలేరు నియోజకవర్గంలో ఎగరవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పుంగనూరు శాసనసభ్యులు రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పీలేరు నియోజకవర్గానికి చెందిన వైకాపా నాయకులు హరీష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పీలేరు నియోజకవర్గానికి చెందిన పలువురు వైకాపా నాయకులు కార్యకర్తలు మర్యాదపూర్వంగా ఆయన కలవడంతో వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై , ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై ప్రజలు విసిగి చెంది ఉన్నారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు ప్రతి ఒక్కరు మొగ్గు చూపుతున్నారని వారిని సంతృప్తి పరిచేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ చిన్న, ద్వారకనాథరెడ్డి తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండేళ్ల పాలనపై జరిగిన అభివృద్ధి నివేదికలు నివేదించండి

**స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి**



**తంబళ్లపల్లె జూన్ 22 ప్రభాతవార్త** తంబళ్లపల్లె నియోజకవర్గం లోని ఆరు మండలాల అధికారులు ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రణాళిక నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి తంబళ్లపల్లె స్పెషలాఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆరు మండలాల మండల స్థాయి అధికారులుతో సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా జలధారజల హారతి నిర్వహణ, పండ్ల తోటల పెంపకం, తల్లికి వందనం, పాఠశాలల స్థితిగతులు,విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ వివరాలు, రైతుభరోసా, విత్తన కాయల పంపిణీ, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పరిక రాలు పంపిణీ వివరాలు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, ఒంటరి మహిళల పెన్షన్ల పంపిణీ, కొత్త పెన్షన్లకు వచ్చిన దరఖాస్తుల వివరాలు, మండలంలో తాగునీరు కోసం జలజీవన్ మిషన్ పనుల నిర్వహణ వివరాలు, 20 47 విజన్ లో నియోజకవర్గానికి మంజూరైన పనులు చేసిన అభివృద్ధి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత గ్యాస్ సిలిండర్, గ్రామాల్లో సిసి రోడ్లు, మురికినీటి కాలువలు, తారు రోడ్ల వివరాలు, వెలుగు లో మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ వివరాలు, ఐసిడిఎస్ లో పిల్లలకు పౌష్టికాహార పంపిణీ, ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి పనుల వివరాలు, ఎన్టీఆర్ వైద్య సేవ, 108, 104 సేవలు, ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ తో పాటు అభివృద్ధి, సంక్షేమ ప్రణాళిక నివేదికలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పెతేరు ప్రాజెక్ట్ డిఈ చంద్రశేఖర్ రెడ్డి,ఎంపీడీవో ఉషారాణి, ఎంఈఓ త్యాగరాజు, డిప్యూటీలు ఎం వి ప్రసాద్, మారుతీ కుమార్, ఏపిఎం గంగాధర్, ఏపీవో అంజనప్ప, ఏఈఈ వినోద్ కుమార్, సతీష్, వెంకటరమణ, సుజాత, నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీవోలు, పలు శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు తప్పవు

**ఎక్సైజ్ సీఐ భీమలింగ**

**మదనపల్లెక్రైం, జూన్ 22 ప్రభాతవార్త.** మదనపల్లె ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టప్రకారం నేరమని స్పష్టం చేశారు. ప్రభుత్వం అనుమతించిన మద్యం దుకాణాల పర్మిట్ రూముల్లో మాత్రమే మద్యం సేవించాల్సి ఉంటుందని, ఈ విషయమై గత వారం రోజులుగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. అయినప్పటికీ కొందరు నిబంధనలను ఉల్లంఘిస్తూ బహిరంగంగా మద్యం సేవిస్తుండటంతో ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అక్రమ బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా ఉంచామని సీఐ భీమలింగ తెలిపారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి, బెల్ట్ షాపు నిర్వహిస్తున్న రామయ్య (44) అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు

## ఆగి ఉన్న టిప్పర్ నుంచి బ్యాటరీల చోరీ.. కేసు నమోదు

**ముద్దనూరు, జూన్ 22 (ప్రభాతవార్త):** ముద్దనూరు మండలంలోని దూదేకుల నారాయణపల్లెకు వెళ్లే రహదారిపై నిలిపి ఉంచిన టిప్పర్ నుంచి రెండు బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు, టిప్పర్‌లో అమర్చిన సుమారు రూ.18 వేల విలువైన రెండు బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు తెలిసింది. టిప్పర్ డ్రైవర్ రామాంజుల్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేష్‌బాబు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# రైతన్న చెంతకే రైతు సేవా కేంద్ర సిబ్బంది

### పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలపై అవగాహన



పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా కరపత్ర విడుదల చేస్తున్న దృశ్యం

**పులివెందుల, జూన్ 22, ప్రభాత వార్త :** రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలను చేరువ చేయడంతో పాటు సమస్యలను తెలుసుకుని పరిష్కరించే లక్ష్యంతో "రైతన్న మీకోసం" కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పులివెందుల మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వి. చెన్నారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తోం దన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ పథకాలు, రైతులకు అందుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి రైతు ఈ పథకాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పులివెందుల మండల పరిధిలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా 4,587 మంది రైతులకు సుమారు రూ.2.99 కోట్ల నిధులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని చెన్నారెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రైతులు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలకు సంబంధించి ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి పరిష్కరించుకో వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భార్గవ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలే పరిష్కార దిశగా అనునిత్యం పోరాటాలు

### ప్రజల సమస్యలు పరిష్కరించడమే మా ధ్యేయం.. రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి

**పీలేరు జూన్ 22 ప్రభాతవార్త:** ప్రతిరోజు ఉదయం నుండి అర్ధరాత్రి వరకు ప్రజలు ఎటువంటి సమస్యల పైన మా దగ్గరకు వచ్చిన వారి సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా పెట్టుకుని అనునిత్యం ప్రజాసేవలో పని చేస్తామని రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి అన్నారు .సోమవారం తిరుపతి మదనపల్లి నేషనల్ హైవే కలికిరి సమీపంలో కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ప్రజలకు సౌకర్యంగా నేషనల్ హైవే రోడ్డు పనులను స్థానిక వైఎస్ఆర్సిపి యువ నాయకులు బావాజీ ఆధ్వర్యంలో కలికిరి మండల పరిధిలోని నేషనల్ హైవే పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేయడమే కాకుండా అధికారమున్న లేకపోయినా వారి సమస్యలను పరిష్కరించేందుకు అధికారంలో లేనప్పుడు పోరాటాలు చేస్తామని అధికారంలో ఉన్నప్పుడు ఆదేశాలు జారీ చేస్తామని మిథున్ రెడ్డి అన్నారు. కలికిరి మండల పరిధిలో వైఎస్సార్సీపీ పార్టీని ఎంతో బలోపేతం చేసి ముందుకు తీసుకు వెళుతున్న మైనార్టీ యువ నాయకులు బావాజీని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎంపీకి ఘనంగా పూలమాలలు సశాలువలతో సత్కరించి రోడ్డు పనులను వాటి స్థితిగతులను అడిగి తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, ఉమ్మడి రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ మరియు



స్టేట్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నల్లారి తిమ్మారెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నల్లారి శ్రీఖర్ రెడ్డి,కలికిరి మండల ఎంపీపీ వేంపల్లి నూర్జహాన్, రాష్ట్ర మహేశ్వర జంగం సేవా సంఘం అధ్యక్షులు మద్దిరాళ్ళ మల్లికార్జున, మండల ఉపాధ్యక్షులు వేంపల్లి బావాజీ, మండల ప్రధాన కార్యదర్శి శివయోగి జగన్నాథ్ కుమార్, మండల యూత్ అధ్యక్షులు వేంపల్లి ఫయాజ్,మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు వేంపల్లి ఖాదర్ భాష, మండల దూదేకుల సంఘం అధ్యక్షులు సరస పల్లి నజీర్, మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు క్రిష్టప్ప, గుట్టపాలెం మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్, ప్రతాప్, రెడ్డప్ప, మదన, వార్డ్ మెంబర్ సయ్యద్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జగన్ పులివెందుల పర్యటన షెడ్యూల్ ఖరారు

**23 నుంచి 25 వరకు వైఎస్సార్ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న వైఎస్సార్‌సీపీ అధినేత**



**పులివెందుల, జూన్ 22 , ప్రభాతవార్త :** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడు రోజుల పాటు వైఎస్సార్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన షెడ్యూల్ విడుదలైంది. జూన్ 23 నుంచి 25వ తేదీ వరకు పులివెందులలో పలు కార్యక్రమాల్లో పాల్గొని, అనంతరం బెంగళూరుకు తిరుగు ప్రయాణం కానున్నారు. పర్యటనలో భాగంగా జూన్ 23వ తేదీ మధ్యాహ్నం 2.40కి బెంగళూరులోని జక్కూర్ ఏరోడ్రోమ్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 3.30 పులివెందుల భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకుని సాయంత్రం వరకు అక్కడే ఉంటారు. సాయంత్రం 7 గంటలకు తన నివాసానికి వెళ్లి బస చేస్తారు. జూన్ 24న ఉదయం 9 గంటలకు భాకరాపురం నుంచి వేముల మండలం భూమయ్యగారిపల్లి గ్రామానికి వెళ్లి అక్కడి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు పూజల అనంతరం తిరిగి పులివెందుల క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ ప్రజా దర్బార్ లో పాల్గొంటారు. సాయంత్రం నివాసానికి చేరుకుని బస చేస్తారు.జూన్ 25న ఉదయం 8.10 గంటలకు భాకరాపురం హెలిప్యాడ్ నుంచి బెంగళూరులోని జక్కూర్ ఏరోడ్రోమ్‌కు బయలుదేరుతారు. అక్కడి నుంచి యలహంకలోని తన నివాసానికి చేరుకుంటారు. జగన్ పర్యటన నేపథ్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రతా పరంగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

## సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు



**మైదుకూరు, జూన్ 22, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని నియోజకవర్గ యంగ్ ప్రొఫెషనల్ వినోద్ కుమార్ పువ్వాడి తెలిపారు పుట్టా సుధాకర్ యాదవ్ గారి ఆదేశాల మేరకు సోమవారం మైదుకూరు సిపిఏ యు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం ( పిజిఆర్ఎస్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు రెవెన్యూ, మున్సిపల్, పింఛన్లు, సంక్షేమ పథకాలు మరియు ఇతర శాఖలకు సంబంధించిన తమ సమస్యలను వినతుల రూపంలో అధికారులకు సమర్పించారు.అందిన ప్రతి వినతిని అధికారికంగా నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కారం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వినోద్ కుమార్ తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయడం, వారి సమస్యలకు పారదర్శకంగా మరియు సమయానుకూలంగా పరిష్కారం లభించేలా పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. స్వీకరించిన వినతులపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**దువ్వూరు, జూన్ 22, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వివిధ రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల తహసీల్దార్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం వచ్చే దరఖాస్తులను సంబంధిత అధికారులు, సిబ్బందికి పంపుతున్నామని వాటిని సరిచూసి రికార్డుల మేరా పరిష్కరించాలన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు నిర్ణీత గడువు ఉంటుందని, ఆ గడువులోగా సమాధానం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి, ఏపీఓ లక్ష్మీనారాయణ, ఏఈ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**తల్లికి వందనం, వితంతు పెన్షన్ వర్తింపజేయాలి**
**కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్**
**ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.కల్పన**



**పులివెందుల, జూన్ 22, ప్రభాతవార్త :** ఎన్నికల ముందు ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.కల్పన, సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు డిమాండ్ చేశారు.ఆశా కార్య కర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూ నియన్ జిల్లా సమితి పిలుపు మేరకు సోమవారం పులి వెందుల రెవెన్యూ డివిజనల్ అధికారి చిన్నయ్యకు ఆశా వర్కర్స్ వినతిపత్రం అంద జేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఆశా కార్యకర్తలకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, తల్లికి వందనం, వితంతు పెన్షన్ తదితర సంక్షేమ పథకాలు వర్తింప జేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేసి ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 18 సంవత్సరాలుగా ఆశా కార్యకర్తలు గ్రామీణ స్థాయిలో ప్రజారోగ్య సేవలు అందిస్తు న్నప్పటికీ వారి సమస్యలు పరిష్కారం కాకుండా నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆరోపించారు.పక్క రాష్ట్రాల్లో ఆశా కార్యకర్తలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తున్నారని, ఆంధ్ర ప్రదేశ్‌లో మాత్రం ఆశాలు చాలీచాలని పారితోషికాలతో పనిచేస్తున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయకపోతే జూలై 7న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహి స్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లాలోని ఆశా కార్యకర్తలకు పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాల, రమీజా, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పైప్ లైన్ లీకేజీలను అరికట్టాలి

**దువ్వూరు, జూన్ 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన దువ్వూరులో, పలు చోట్ల మంచినీటికి సంబంధించిన పైపులు లీకేజీ అవుతున్నాయని, వాటిని అరికట్టాలని దువ్వూరు ప్రజలు కోరుతున్నారు. మెయిన్ రోడ్డులో స్థానిక పోలీస్ స్టేషన్ సమీపాన పైప్ లైన్ లీకేజీ అయి నీరు నిల్వ ఉంటుందని అలాగే కామనూరు రోడ్డులో ఒకటి, రెండు చోట్ల అలాగే ఉన్నాయని వాటిని పంచాయతీ అధికారులు అరికట్టాలని దువ్వూరు ప్రజలు కోరారు. అలాగే పోలీస్ స్టేషన్ సమీపాన ఉన్న మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని వాటిని కూడా పరిష్కరించాలని కోరారు.

## అధైర్యపడకండి అండగా ఉంటాం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



**పీలేరు, జూన్ 22 ప్రభాతవార్త:** మండలంలోని ప్రజలు వైసిపి నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటామని పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గోరంట్లపల్లె పంచాయతీ యర్రదొడ్డివారిపల్లెకు చెందిన వైఎస్సార్సీపీ నాయకులు పెద్దిరెడ్డి రమేష్ కుమార్ రెడ్డి తండ్రి పెద్దిరెడ్డి రెడ్డెప్పరెడ్డి వారం క్రితం మృతి చెందారు. సోమవారం ఆయన కర్మక్రియలు నిర్వహించారు. రెడ్డెప్పరెడ్డి చిత్రపటానికి మాజీ మంత్రి నివాళులర్పించారు. మండలంలోని పార్టీ నాయకులతో కలసి పార్టీ పటిష్టతపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, ఏపీ. ఎండీసీ మాజీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు పి. ద్వారకనాథరెడ్డి, దినేష్ రెడ్డి, పద్మనాభరెడ్డి, పెద్దసిద్ధయ్య, సి.కె. యర్రమరెడ్డి, కొల్లు యర్రమరెడ్డి, జయరామచంద్రయ్య, దిగవగల్ల శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి, సతీష్ రెడ్డి,మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తన భూమి దగ్గరికి వెళ్లడానికి దారి వసతి కల్పించాలని ఆర్డీవోకు వినతి



ఆర్డిఒకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**పీలేరు జూన్ 22 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని కెవి పల్లి మండలం జిల్లేళ్ళ మంద గ్రామం బొమ్మలాట వారి పల్లి గ్రామానికి చెందిన జి చంద్రశేఖర్ కుమారుడు జి. ప్రవీణ్‌కు సంబంధించిన భూమికి దారి కల్పించాలని పీలేరు ఆర్డిఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 1872/1లో తమకు మూడు ఎకరాల మామిడి తోట ఉందని పూర్వీకుల నుంచి అక్కడ ప్రభుత్వ భూమిలో వెళ్లడానికి దారి వసతి ఉండేదని ఇటీవల కాలంలో జి.సుబ్బయ్య అనే అతను దారి లేకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని వేరుశనగ పంట వేయాలని ప్రయత్నిస్తున్నారని భూమికి సంబంధించిన పత్రాలు జతపరిచానని, సంబంధిత అధికారులు పూర్వపరాలు పరిశీలించి వ్యవసాయం చేసుకోవడానికి మాకు దారి కల్పించాలని ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

## ప్లాట్ల సమస్యను పరిష్కరించండి



**వేంపల్లె, జూన్ 22, ప్రభాత వార్త :** ప్లాట్ల సమస్యలను పరిష్కరించాలని మాజీ వార్డు మెంబర్ నాగన్న కోరారు. సోమవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో ఉన్న తహసిల్దార్ శివశంకర్ రెడ్డిని ప్లాట్ దారులు వినతి పత్రం అందజేశారు. 1997 లో కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించి ఈసీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, పన్ను రసీదులు మరియు ఇతర పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నప్పటికీ, కొందరు వ్యక్తులు ప్లాట్లు తమరివి అని బెదరిస్తున్నారని బాధితులు ఆరోపించారు. సింగారెడ్డి రఘునాథరెడ్డి, తెలంగాణ వలి బత్తల జయశంకర్, గడ్డం గురుప్రసాద్, బత్తల శంకరయ్యతో పాటు పలువురు ప్లాట్లపై తమ హక్కులు ఉన్నట్లు పేర్కొంటున్నారని తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా తాము చట్టబద్ధంగా కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పలువురు మహిళలు కన్నీటి పర్యంతమై తాహసిల్దారు వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదని ప్లాట్లను కొనుగోలు చేసిన 92 కుటుంబాల హక్కులను పరిరక్షించాలని తాహసిల్దారును బాధితులు స్పష్టం చేశారు.ప్లాట్లకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించి, వాస్తవాలను వెలికి తీసి 92 కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు,

## అధికారుల అనుమతి లేకుండా ఆ భూమిలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకూడదు

**తహశీల్దారు తిరుమలబాబు, సీఐ రామక్రిష్ణ**



**బద్వేలు, జూన్ 22 ప్రభాతవార్త:** గత కొద్ది రోజులుగా బద్వేలు మండలం చెన్నంపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 1580లోని భూమిని ఆక్రమించి విగ్రహాలు, శిలువలు, ప్రతిమలు పేరుతో చేసే కార్యక్రమాలకు అధికారుల అనుమతి లేదని ఈ స్థలంలో ఆ భూమి మీద నిషేధం విధించామని తహశీల్దారు తిరుమల బాబు, సీఐ రామక్రిష్ణలు తెలి పారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గోపాలస్వామి, బాలస్వామి, వారి మద్దతుదారులు, ఇతర వ్యక్తులు ఎవరేగాని సర్వేనెం.1580లో ఉన్న భూమిలోకి ప్రవేశించడం, ఆక్రమించడం, అతిక్రమిం చడం, మార్పులు చేయడం లాంటివి చేపడితే చర్యలు తప్పవన్నారు. ఈ భూమిలో వివాదమైనందున అధికారుల ఉత్తర్వులు వచ్చేంతవరకు ఎవరూ వాటిని ఉల్లంఘించకూడదని హెచ్చరించారు. విగ్రహాల పేరుతోగాని, శిలువల పేరుతో గాని, మత పరమైన సమస్యలు రెచ్చగొట్టే కార్యక్రమాలు ఎవరూచేసినా ఉపేక్షించే దిలేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ ఉత్తర్వులు నేటినుంచి అమలులోకి వస్తాయని వారు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల జీతం కోసం నేడు ఎమ్మెల్యే వరద నిరసన

**ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 22 ప్రభాతవార్త** ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని పారిశుద్ధ్య కార్మికులకు 3 నెలల 20 రోజుల నుంచి కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వలేదని దీనివలన పారిశుద్ధ్య కార్మికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి మంగళవారం నాడు ఉదయం 8 గంటల నుండి పారిశుద్ధ్య కార్మికులతో కలసి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెల పిఎఫ్, ఈఎస్ఐ పోగా 13,960 రూపాయలు జీతం ఇవ్వవలెనని కానీ కాంట్రాక్టర్ కేవలం 11,900 మాత్రమే ఇస్తున్నారని పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల 13,960 రూపాయలు జీతం ఇచ్చే వరకు ఈ నిరసన కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

## కలికిరిలో ముమ్మరంగా ఓటరు మ్యాపింగ్ ఇంటింటి కార్యక్రమం



**కలికిరి, జూన్ 22, ప్రభాతవార్త:** మండలంలోని కలికిరి మేజర్ పంచాయతీలో సోమవారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కలికిరి పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రెడ్డివారి యోగేష్‌రెడ్డి, కలికిరి బూత్ కమిటీ కన్వీనర్ బావాజీ, బీఎల్ఓ శిల్పకుమారి నల్లావారిపల్లి, ఎల్లమ్మగుడి వీధి, కాలేజీ రోడ్డు, పలు గ్రామాల్లో పర్యటించి ఓటరు మ్యాపింగ్ ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటరు లిస్టు తనిఖీ చేసి ఓటరుకు సంబంధించిన వివరాలు పరిశీలించారు. అనంతరం ఓటరు మ్యాపింగ్ నిర్వహించారు. సర్ కార్యక్రమంలో భాగంగా 2002 ఓటరు లిస్టు, 2026 ఓటరు లిస్టును ఉంచుకొని ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొత్తగా ఓటరు నమోదు, మృతి చెందిన వారి పేర్లు తొలగించడం వంటి చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్డివారి యోగేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటుకు సంబంధించి వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని చూసుకోవాలన్నారు. బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలను సంప్రదించి కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. సర్‌పై టీడీపీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఓటు హక్కు కలిగి ఏ ఒక్కరూ కూడా తమ ఓటు హక్కు వినియోగించుకోకుండా పోకూడదన్నారు. ప్రతి ఒక్కరూ 18 సంవత్సరాలు నిండిన వారిని కొత్త ఓటరుగా నమోదు చేయాలని ఆయన తెలిపారు. ఇది వరకే బూతు కన్వీనర్ బావాజీ బీఎల్‌ఓలతో ఇంటింటికి వెళ్లి కొత్త ఓటరు నమోదు చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, బీఎల్‌ఓ శిల్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సల్లాపురమ్మ అమ్మవారి జాతర



**కలికిరి, జూన్ 22, ప్రభాతవార్త:** మండలంలోని పత్తేగడ పంచాయతీ కొటాల గ్రామంలో నరగామ దేవతగా వెలసిన శ్రీ సల్లాపురమ్మ అమ్మవారి జాతర నేటి నుంచి 3 రోజుల పాటు జరుగుతుందని రాష్ట్ర జంగం సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ వాసనూరి చంద్రశేఖర్ సల్లాపురం అమ్మవారి ఆలయ ధర్మకర్త వాసనూరి చల్లయ్యలు తెలిపారు. మంగళవారం రాత్రి జాగారం, బుధవారం సిల్లు బోనాలు, బుధవారం రాత్రి చాందినీ బండ్ల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జాతర సందర్భంగా ఇప్పటికే అమ్మవారిని పంచాయతీలోని గ్రామాలలో పుష్పపల్లకిలో ఊరేగిస్తున్నారు. కొటాల గ్రామంలో జరిగే సల్లాపురం అమ్మవారి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి సేవలో పాల్గొనాలని ఆలయ ధర్మకర్త చల్లయ్య కోరారు.